ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

ఆదివారం 15 డిసెంబరు 2024



ఉద్దండరాయునిపాలెంలో డంప్ చేసిన ఇసుక దిబ్బలు



తాడేపల్లి మండలం గుండిమెడ దగ్గర బారులు తీరిన లారీలు



మున్నంగి దగ్గర నదిలో ఎక్స్‌కవేటర్ పెట్టిమరీ లారీల్లో ఇసుక నింపుతున్న చిత్రం

ఉచితమన్నా దోపిడీనే

- డబ్బు కొట్టే ఇసుక సరఫరా
- చెలరేగిపోతోన్న ఇసుకాసురులు

- ప్రభుత్వ లక్ష్యానికి అక్రమార్కుల తూట్లు
- పట్టపగలే ఎక్స్‌కవేటర్లతో నదిలో తవ్వకాలు
- అక్రమాలపై కన్నెత్తి చూడని మైనింగ్, పోలీసుశాఖలు
- చామర్తి, కేవీపాలెం, అంబడిపూడి, చింతపల్లి రేవుల్లో బరితెగింపు
- ఉద్దండరాయునిపాలెంలో మాజీ ఎంపీ నందిగం అనుచరుల దోపిడీ

ఇసుక.. ప్రభుత్వం ఉచితమంటోంది. సులభంగా.. రవాణా చార్జీలు భారం కాకుండా.. కొరత లేకుండా.. అందివ్వాలని కూటమి ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. అయితే నేతల జోక్యం.. అధికారుల మౌనంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల పరిధిలో ఉచితమన్న ఊసే లేకుండా.. ప్రభుత్వ ఇసుక పాలసీని తూట్లు పొడుస్తూ.. ఇసుకాసురులు బరితెగిస్తున్నారు. పగలు.. రాత్రి.. అన్న తేడా లేకుండా.. యంత్రాలతో ఇసుకను తోడేస్తూ తరలిస్తున్నారు. సామాన్యుల కోసమని ప్రభుత్వం పన్నులు, సీనరేజ రద్దు చేసి ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించగా అది ఎక్కడా అమలు కావడంలేదు. అంతా ఉచితమే అయినా తక్కువకయినా ఇస్తున్నారా అంటే టన్నుకు రూ.600పైగా వసూలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వసూలు చేసినట్లుగానే.. కొన్ని దగ్గర్ల అయితే అంతకుమించి ఇసుకకు ధర నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ఉచిత ఇసుక అన్న మాటకు అవకాశం లేకుండా పెద్దఎత్తున దోపిడీ జరుగుతోంది. అధికారులకు ఈ విషయం తెలిసినా పట్టించుకోకుండా అక్రమార్కులకే సహకరిస్తున్నారన్న విమర్శలు, ఆరోపణలున్నాయి. కొన్ని దగ్గర్ల అక్రమార్కులకు నేతల సహకారం పూర్తి స్థాయిలో ఉండటంతో అధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితమవుతున్నారు.



మున్నంగిలో ఇసుక కోసం వేసిన గాలు మార్గం

తెనాలి, గుంటూరు, గుంటూరు సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇసుకపై అస్తవ్యస్త విధానాలతో భవన నిర్మాణదారులు అల్లాడిపోయారు. పనులు లేక కూలీలు కష్టాలు పడ్డారు. ఇసుక దొరకకుండా చేశారు.. ఒకవేళ ఉన్నా భారీ ధర వెచ్చించాల్సి వచ్చేది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రజలకు ఇసుక కష్టాలు తీర్చడంతో పాటు రవాణా చార్జీల భారం పడకుండా ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టింది. సామాన్యులకు సాధ్యమైనంత తక్కువ ధరకు ఇసుక అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించి ఆదాయాన్ని కూడా ప్రభుత్వం వదులుకుంది. అయితే కాంట్రాక్టర్లు, స్థానిక నాయకులు ఇసుకను దోచేస్తున్నారు. నదిలో కూలీలతో మాత్రమే తవ్వకాలు జరపాలన్నా కాంట్రాక్టర్లు పట్టపగలే ఎక్స్‌కవేటర్లు పెట్టిమరీ ఇసుక తవ్వేస్తున్నారు. డంపింగ్ చార్జీలు లేవు కనుక తక్కువ ధరకు ఇసుక ఇస్తున్నారా అంటే అదీలేదు. గత ప్రభుత్వ హయాంలో పది చక్రాల లారీ ఇసుక సామాన్యుడికి చేరడానికి రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు చెల్లించాల్సి వచ్చేది. అప్పట్లో

(మిగతా 8వ పేజీలో)

ఇసుకాసురులు.. ఇష్టారాజ్యం

- ప్రకాశం బ్యారేజి దిగువున కొల్లిపర మండలం మున్నంగి, తాడేపల్లి మండలం గుండిమెడ దగ్గర మాత్రమే ఇసుక డంపింగ్, లోడింగ్‌కు అనుమతి ఇచ్చారు. ఇక్కడ కూలీలతో నది నుంచి ఇసుక బయటకు తీసుకురావాలి. కానీ వరదతో గాలు కొట్టుకుపోయిందన్న సాకులతో ఏకంగా ఎక్స్‌కవేటర్‌నే నదిలో పెట్టి మరీ లారీలకు లోడ్ చేయించడం కాంట్రాక్టర్ల బరి తెగింపునకు నిదర్శనం.
- తెనాలిలో నిర్ణయించిన ధర ప్రకారం 20 టన్నులకు రూ.5 వేలు, 25 టన్నులకు 6,250 చొప్పున తీసుకోవాలి. టెండర్ ప్రకారం అయితే ఇంకా తక్కువే తీసుకోవాలి. గాలు మార్గం నిర్వహణ పేరుతో రెట్టింపు వసూళ్లకు దిగుతున్నారు. 10 చక్రాల లారీకి రూ.7 వేలకు పైగా వసూలు చేస్తున్నారు. అదే బిల్లు లేకుండా అయితే రూ.6 వేలు చెల్లించాల్సిన పరిస్థితి. 12 చక్రాల లారీకి రూ.8 వేల వరకు వసూలు చేస్తున్నారు. రాత్రి వేళల్లో అదనంగా పోసే ప్ర తి ఎక్స్‌కవేటర్ బొచ్చెకు రూ.750 వసూలు చేస్తున్నారు. లారీకి అదనంగా వసూలు చేసేదికాక రాత్రివేళ రూ.2,500 నుంచి రూ.5,500 వరకు వసూలు చేస్తున్నారు.
- బాపట్ల సమీపంలోని పందిళ్లపల్లి, స్టూవర్టుపురం, యాజలి, ప్రాంతాల్లో భూముల అడుగున ఇసుక పొరలను తవ్వేసి అమ్మేస్తున్నారు. ఇందుకు అనుమతి లేకపోయినా కూటమి నేతల్లో ఒకరు మావాటా మాకిచ్చి మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి, ఎవరూ అడ్డుకోరంటూ అభయం ఇస్తున్నారు.

రేవుల్లో బరితెగింపు..

- వైసీపీ హయాంలో బెజవాడ కేంద్రంగా ఉన్న జీసీకేసీ సంస్థ అచ్చంపేట మండలంలోని చామర్తి, కేవీపాలెం, అంబడిపూడి, చింతపల్లి రేవుల్లో ఇసుక తవ్వకాలకు అనుమతి పొందింది. అయితే అనుమతి ఒక చోట తీసుకుని మరో చోట తవ్వకాలు చేపట్టినట్లు మైనింగ్ శాఖ నిర్ధారించి ఆ సంస్థకు రూ.5.10 కోట్ల పెనాల్టీ విధించింది. దీనిపై ఆగస్టు 8న పల్నాడు మైనింగ్ అధికారి నాగిని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయినా వెనక్కి తగ్గని సంస్థ అదే రీచ్‌ల్లో పాత పద్ధతిలోనే తవ్వకాలు చేస్తున్నట్లు ఇటీవల తనిఖీల్లో విజిలెన్స్ ఎస్పీ గుర్తించారు. నదీ గర్భంలోని 9 జేసీబీ, ఎక్స్‌కవేటర్లు, మూడు లారీలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారంటే వారి బరితెగింపు ఏవిధంగా అర్థం చేసుకోవచ్చు.
- బాపట్ల, చీరాల ప్రాంతాలకు ఇసుక ఏటి నుంచి రావాలంటే మున్నంగి నుంచి అందాలి. ఇక్కడి నుంచి కొనుగోలు, రవాణా కలిపితే ఎక్కువ ధర పడుతుంది. దీంతో జనం భూమిలోని ఇసుకనే ఉపయోగించడానికి మొగ్గు చూపడంతో వాటి ధరలు కూడా అమాంతం పెంచేశారు. ట్రాక్టర్‌కు 5 టన్నులు పోసి రూ.3 వేలు, లారీకి 30 టన్నులు పోసి రూ.15 వేల నుంచి రూ.18 వేలు వసూలు చేస్తున్నారు. నేరుగా ఎక్స్‌కవేటర్ పెట్టి దండుకుంటున్నారు.

ఏకగ్రీవాలకు.. జై

- ఫలించిన కూటమి నేతల కసరత్తు
- జాడలేని విపక్షం.. రైతుల్లో ఏకాభిప్రాయం
- ఎట్టకేలకు తొమ్మిదేళ్ల అనంతరం ఎన్నికలు
- జిల్లాలో 234 సాగునీటి సంఘాలు ఏకగ్రీవం
- అన్ని సంఘాల్లో కూటమి మద్దతుదారులకే పదవులు
- మాదల నీటి సంఘం, పాల్వాయి ఉపాధ్యక్ష ఎన్నిక వాయిదా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగునీటి సంఘాలను ఐదేళ్ల పాలనలో వైసీపీ పూర్తిగా పక్కన పెట్టేసింది. రైతులకు, సాగునీటి ప్రణాళికలకు ఎంతో అవసరమైన సంఘాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి ఎన్నికలకు సిద్ధమైంది. గతంలో ఊసే మరిచిన వైసీపీ నేతలు ఇప్పుడు ఎన్నికలను బహిష్కరించారు. ఎన్నికలపై ప్రభుత్వం దృష్టి సారించినప్పటి నుంచే సాగునీటి సంఘాలను ఏకగ్రీవం చేయాలని కూటమి నేతలు కసరత్తు చేశారు. సేవా భావం కలిగిన వారిని ఎన్నుకోవాలని నేతలు రైతులకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో విపక్షం ఎన్నికలకు దూరం కాగా.. కూటమి నేతల కసరత్తుతో.. రైతుల ఏకాభిప్రాయంతో చాలావరకు సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎంపిక జరిగింది. తొలుత సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి వారిని క్రియాశీలకంగా మార్చడం ద్వారా తిరిగి సాగునీటి రంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు రాగా.. రైతులు అందుకు ఏకాభిప్రాయంతో జై కొట్టారు. ఈ క్రమంలో తొలి అడుగుగా వాటర్ యూజర్స్ అసోసియేషన్ ఎన్నికలను శనివారం యంత్రాంగం పూర్తి చేసింది. ఎట్టకేలకు తొమ్మిదేళ్ల అనంతరం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలతో పల్లెల్లో సందడి నెలకొంది. ఆయా సంఘాల పరిధిలో సభ్యులుగా ఉన్న రైతులంతా ఎన్నికల కేంద్రాలకు ఉదయమే తరలివచ్చారు. ఉదయం ప్రాదేశిక(టీసీ) మేరకు నీటి సంఘాలకు కాల్వ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఎన్నికల సందర్భంగా పోలీసు శాఖ పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసింది. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జలవనరులశాఖ అధికారులు ఎన్నికలను పర్యవేక్షించారు. నీటి సంఘాలు ఏర్పడిన తర్వాత మూడోసారి ఎన్నికలు జర్గా గతంలో ఎప్పుడూ లేని



నరసరావుపేట మండల పరిధిలోని సాగునీటి సంఘాలకు ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు

సభ్యుల ఎంపిక జరగ్గా, మధ్యాహ్నం వాటర్ యూజర్స్ అసోసియేషన్ (డబ్ల్యుయూఏ)కు అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికను అధికారులు పూర్తి చేశారు. ఈ ఎన్నికలను వైసీపీ బహిష్కరించడంతో చాలా చోట్ల ఏకగ్రీవమయ్యాయి. నియోజకవర్గాల వారీగా కూటమి పార్టీలు ముందస్తు అవగాహనతో పదవులను కేటాయించారు. ఎన్నికలు జరుగుతున్న తీరుపై ఎప్పటికప్పుడు పార్టీ నేతలతో ఎమ్మెల్యేలు సమీక్షించారు. మొత్తంమీద నీటి సంఘాల్లో వైసీపీ మద్దతుదారుల ఉనికి లేకుండా పోయింది. కూటమి పార్టీలైన టీడీపీ, బీజేపీ, జనసేన మద్దతుదారులు నీటి సంఘాలకు ఎన్నికయ్యారు. ప్రభుత్వ నిబంధనల విధంగా అన్ని సంఘాలకు ఏకగ్రీవ ఎన్నికలు జరగడం ఇదే ప్రథమం. ప్రశాంతంగా ఎన్నికలు ముగియడంతో నేతలు ఊపిరి పీల్చుకున్నారు. ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎమ్మెల్యేలు, కూటమి నేతలు అభినందించారు. రైతులకు సేవలు అందించడంలో సంఘాలు కృషి చేయాలని వారు పిలుపు ఇచ్చారు.

నియోజకవర్గం	ఏకగ్రీవాలు
నరసరావుపేట	19
వినుకొండ	66
సత్తెనపల్లి	37
గురజాల	37
పెదకూరపాడు	42
చిలకలూరిపేట	16
మాచర్ల	17

17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు

డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు 17న ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. డీసీ పదవులకు కూటమి నేతల మధ్య పోటీ తీవ్రంగా ఉంది. డీసీలకు ఎన్నికైన వారు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటారు. చైర్మన్ పదవిని ఆశిస్తున్న నేతలు కొందరు నీటి సంఘాల అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

468 మందికి పదవులు

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 235 సంఘాలకు 234 సంఘాలకు ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. ముప్పాళ్ల మండలం మాదల నీటి సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఎన్నిక నిలిచిపోయింది. టీడీపీ మద్దతుదారులు ఇద్దరు అధ్యక్ష పదవికి పోటీ పడటంతో ఎన్నిక నిలిచినట్లు సమాచారం. రెంటచింతల మండలం పాల్వాయి పరిధిలో ఉపాధ్యక్ష అభ్యర్థి విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఎన్నిక వాయిదా పడింది. కూటమి శ్రేణుల్లో 468 మందికి పదవులు దక్కాయి. నూజెండ్ల మండలంలోని కంభంపాడు గ్రామంలో ఎన్నికల విషయంలో టీడీపీలోని నాయకుల మధ్య నెలకొన్న వివాదాలు ఘర్షణకు దారి తీశాయి. ఈ ఘర్షణలో ఉప సర్పంచ్ మేదరమెట్ల అనీల్, ఎం ద్దూరి బాపనయ్య, గంగినేని శ్రీనివాసరావులు గాయపడ్డారు. వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ బీవీ కృష్ణారావులు గ్రామానికి వెళ్ళి ఘర్షణను నివారించారు.

సాగర్‌లో.. విమానాశ్రయం

- ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ అధ్యయనం
- సాధ్యాసాధ్యాలపై ఈ నెల 25న నివేదిక
- ఆ తర్వాత భూసేకరణ.. కమర్షియల్ ఆపరేషన్స్

గుంటూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విమానయానాన్ని ప్రోత్సహించే క్రమంలో కొత్తగా ఎయిర్‌పోర్టులను నిర్మించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా నాగార్జునసాగర్‌లో ఒక విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) సాధ్యాసాధ్యాలపై అధ్యయనం ప్రారంభించింది. మరో 10 రోజుల్లో(ఈ నెల 25వ తేదీ లోపు) ఈ అధ్యయన నివేదిక కేంద్ర ప్రభుత్వానికి అందనుంది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు రాష్ట్రానికి చెందిన ఎంపీ కావడం, ఆయనతో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన టీడీపీ నేతలకు ఉన్న సత్సంబంధాల దృష్ట్యా సాగర్‌లో కమర్షియల్ ఆపరేషన్స్‌తో ఒక విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. నాగార్జునసాగర్ రాష్ట్రంలో ఒక పర్యాటక ప్రాంతంగా ఉన్నది. ఏటా నాగార్జునకొండని సందర్శించేందుకు దేశ, విదేశాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. అయితే ప్రస్తుతం వారంతా రోడ్డు మార్గంలోనే ఇక్కడికి వస్తున్నారు. ఒక ఎయిర్‌స్ట్రిప్ ఉన్నప్పటికీ ఇది ప్రైవేట్ జెట్‌ల కోసమే వినియోగిస్తున్నారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడ ఒక విమానాశ్రయాన్ని ఏర్పాటు చేయాలని తలపోసినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. కాగా కూటమి ప్రభుత్వం ప్రతీ జిల్లాలో ఒక విమానాశ్రయం ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నది. తద్వారా రాష్ట్రం పురోభివృద్ధి సాధిస్తుందన్న నమ్మకంతో ఉన్నది. కలెక్టర్ల సదస్సులోనూ ఈ విషయాన్ని నొక్కి చెప్పింది. అనేక పర్యాటక ప్రదేశాలు ఉన్నప్పటికీ సరైన రవాణా, వసతి సౌకర్యాలు లేకపోవడం వల్ల పర్యాటకులను ఆకర్షించలేకపోతున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే సీ ప్లేన్ సర్వీసుని విజయవాడ వైపున ప్రకాశం బ్యారేజ్ నుంచి ప్రారంభించారు. సీప్లేన్/వాటర్‌డ్రోమ్స్ సర్వీసులను అమరావతి రాజధానికి ఉన్న వాటర్‌ఫ్రంట్ వైపు నుంచి కూడా ప్రారంభించవచ్చు. అలానే సాగర్‌లోనూ ఈ సదుపాయం ఏర్పాటుకు అవకాశాలున్నాయి. వాటర్‌డ్రోమ్ ఏర్పాటుకు ఫీజిబిలిటీ రిపోర్టుని ఈ నెల 20 లోపు ఇవ్వాలని గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. కాగా నాగార్జునసాగర్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తే కమర్షియల్ ఆపరేషన్స్‌కి డిమాండ్ లభ్యమయ్యే అవకాశం ఉన్నది. పర్యాటకంతో పాటు సిమెంటు, సున్నపురాయి పరిశ్రమలకు ఆ ప్రాంతం ఖిల్లాగా ఉన్నది. దీని దృష్ట్యా విమానయానానికి డిమాండ్ కచ్చితంగా ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమౌతున్నది.



వర్సిటీలో.. సర్టిఫికేట్లు

- నాగార్జున విశ్వవిద్యాలయంలో కలకలం
- డిగ్రీ కోర్సుల నకిలీ ధ్రువీకరణపత్రాల గుర్తింపు
- పీజీ స్పాట్ అడ్మిషన్లలో వెలుగు చూసిన నకిలీలు
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా నాలుగు రోజులగా మౌనం
- పోలీసులకు ఫిర్యాదుపైనా పట్టించుకోని వర్సిటీ ఉన్నతాధికారులు

పెదకాకాని, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జునుడి పేరుతో వెలిసిన విద్యాలయం.. రాజధాని అమరావతి పరిధిలో ప్రధాన వర్సిటీ.. అలాంటి విద్యా కేంద్రంపై గతంలో ఎన్నో ఆరోపణలు, విమర్శలు వచ్చాయి. కానీ విద్యార్హత ధ్రువపత్రాలే నకిలీలు జారీ చేయడం.. ఆ విషయం తెలిసీ మౌనం వహించడంతో వర్సిటీ ఉన్నతాధికారుల పాత్రపై అనుమానాలు వస్తున్నాయి. నాగార్జున విశ్వవిద్యాలయ పీజీ స్పాట్ అడ్మిషన్లలో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగు చూసింది. నాలుగు రోజులుగా వర్సిటీలో కలకలం సృష్టిస్తున్న ఘటనకు సంబంధించిన వివరాలు.. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయలంలో పది రోజుల క్రితం పీజీ కోర్సుల ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్‌ను ఉన్నతాధికారులు నిర్వహించారు. అడ్మిషన్ల డైరెక్టర్ బ్రహ్మజీరావు ఆధ్వర్యంలో స్పాట్ అడ్మిషన్లు జరిగాయి. కాగా కొందరు విద్యార్థులు గతంలో వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో డిగ్రీ చదివినట్లు సర్టిఫికెట్లను కౌన్సెలింగ్‌లో అందజేశారు. వర్సిటీ దూరవిద్యా కేంద్రంలో చదివినట్లుగా అనేకమంది విద్యార్థులు కూడా తమ విద్యార్హత ధ్రువపత్రాలను అందజేశారు. ఈ క్రమంలో రెగ్యులర్ డిగ్రీ చదివిన నలుగురువి, దూరవిద్యా ద్వారా డిగ్రీ చదివిన ఐదుగురు విద్యార్థులకు చెందిన సర్టిఫికెట్లు నకిలీవిగా అడ్మిషన్ కేంద్రంలోని ఉద్యోగులు నాలుగు రోజుల క్రితం గుర్తించారు. అనంతరం వర్సిటీ సర్వర్‌లో పరిశీలించినా ఆ తొమ్మిది మంది సరిఫికెట్లు లేవు. ఈ ఏడాది జూన్‌లో ఈ సర్టిఫికెట్లు వర్సిటీ నుంచి జారీ అయినట్లుగా ఉంది. అప్పుడు ఏ అధికారులైతే పరీక్షల విభాగంలో ఉన్నారో ఆ అధికారులే సర్టిఫికెట్లు ఇచ్చినట్లుగా వారి సంతకాలు ధ్రువపత్రాలపై ఉన్నాయి. వెరిఫికేషన్‌లో ఆ సర్టిఫికెట్లు నకిలీవి అని తేలడంతో వర్సిటీ ఉద్యోగులు కంగుతిన్నారు. అనంతరం ఉద్యోగులు వర్సిటీ ఉన్నతాధికారులకు ఈ నకిలీ సర్టిఫికెట్ల సమాచారాన్ని తెలిపారు. ఈ సర్టిఫికెట్లపై పోలీసులకు ఫిర్యాదు చేద్దామని ఓ అధికారి నేరుగా వర్సిటీ ఉన్నతా ధికారికి చెప్పి నాలుగు రోజులవుతున్నది. కొందరు ఉన్నతాధికారులకు తెలిసే నకిలీల వ్యవహారం జరిగిందని అందువల్లే వారు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల సంతకాలు కూడా ఆ ధ్రువపత్రాలపై ఉన్నందునే వారు చర్యలకు, పోలీసులకు ఫిర్యాదుకు వెనుకడుగు వేస్తున్నారని సమాచారం.



వేర్వేరు కేసుల్లో 1.5 కేజీల గంజాయి స్వాధీనం
- ఏడుగురు అరెస్టు 6
- 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

రేపు కోటప్పకొండలో ఆరుద్రోత్సవం
- విశేష అభిషేకాలకు విస్తృత ఏర్పాట్లు
- తరలిరానున్న మేధాదక్షిణామూర్తి మాలధారణ స్వాములు

8

అమరావతి నుంచి హైవేకి రోడ్ల అనుసంధానం

రాజధాని రైతుల కేసులు పరిష్కారం

జమిలీ ఎన్నికలతో ప్రజాస్వామ్యానికి ముప్పు



సమావేశంలో మాట్లాడుతున్న బాబురావు, పక్కన పాశం రామారావు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): దేశంలో జమిలీ ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యానికి ముప్పు ఏర్పడుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు అన్నారు. స్థానిక బ్రాడీపేటలోని పీఎల్‌రావు భవన్‌లో శనివారం సీపీఎం 25వ జిల్లా మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమిలీ ఎన్నికలతో ప్రాంతీయ పార్టీలకు నష్టం జరుగుతుందన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక ఒకే పార్టీ పేరుతో రాజకీయంగా లబ్ధి పొందడానికి బీజేపీ చేస్తున్న కుట్రలో ప్రాంతీయ పార్టీలు కూడా చిక్కుకుంటున్నాయని తెలిపారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు కమ్యూనిస్టులు, లౌకిక వాదులు ఐక్యం కావాలన్నారు. అల్లు అర్జున్ అరెస్టుపై స్పందించిన రాజకీయ పార్టీల నాయకులు, మేధావులు, సినీ నటులు మణిపూర్‌లో జరిగిన అల్లర్లపై ఎందుకు స్పందించలేదన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ అదానితో జగన్ ప్రభుత్వం కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందంపై హైకోర్టులో కేసు దాఖలు చేసిన ప్రస్తుత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఇప్పుడే అదే ఒప్పందాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయకుండా ఎందుకు కొనసాగిస్తుందో చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కల్తీ విత్తనాలు, కల్తీ పురుగు మందులకు జిల్లా అడ్డాగా మారినప్పటికీ, వారిపై తీసుకుంటున్న చర్యలు శూన్యమని విమర్శించారు. జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు సక్రమంగా లేదన్నారు. రాజధాని అమరావతిలో ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సభకు జిల్లా నాయకులు కె.నళినీకాంత్, ఎస్.ఎస్ చెంగయ్య, ఎల్.అరుణ అధ్యక్షులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పాశం రామారావు, వై.నేతాజి, ఈమని అప్పారావు, ఎం.రవి, భావన్నారాయణ, ఎస్ఎస్ చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో 1.5 కేజీల గంజాయి స్వాధీనం

- ఏడుగురు అరెస్టు
- 6 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన గుంటూరు వన్ టౌన్ సీఐ లత, సిబ్బంది

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని రోడ్డులోని వాసవి నగర్ వద్ద 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు శనివారం గుంటూరు వన్ టౌన్ ఎక్సైజ్ సీఐ బి.లతా తెలిపారు. పల్నాడు జిల్లా అమరావతి సమీపంలోని లింగాపురం గ్రామానికి చెందిన వేమవరపు ప్రేమ్ కుమార్ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు ప్రాంతానికి వెళ్లి గంజాయి తీసుకొచ్చాడు. నగరంలోని స్నేహితులైన పరమాయకుంట వద్ద గల అరుంధతి నగర్‌కు చెందిన గున్నం యశ్వంత్ సాయిరాం, మంగళదాస్ నగర్ సమీపంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన గొట్టిముక్కల సుమంత్ కలిసి గంజాయిని అమ్మేందుకు చిన్న చిన్న పొట్లాలుగా కట్టారు. వాసవి నగర్ చివరలోని బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్ వద్ద గంజాయి అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 600 గ్రాముల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పర్చారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు మహమ్మద్ కాశీం షరీఫ్, సిబ్బంది బసవేశ్వరరావు, పూర్ణచంద్రరావు, సంధ్య, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

దుగ్గిరాల మండలంలో..

దుగ్గిరాల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు మీడియా సమావేశంలో వెల్లడించిన వివరాల మేరకు.. గంజాయి విషయంలో మంగళగిరి నియోజకవర్గమంతా నిఘా పెట్టారు. దుగ్గిరాల గ్రామ శివారులోని ఈమని లాకుల వద్ద అనుమానాస్పదస్థితిలో ముగ్గురు యువకులు సంచరిస్తున్నారనే సమాచారంతో వారిని చుట్టుముట్టి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 550 గ్రాముల గంజాయితో ఉన్న పాలిథిన్ కవరును స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు రావూరి హర్షవర్ధన్ అరకు సమీపంలోని పాడేరు నుంచి తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో పరిచయమైన చిలువూరుకు చెందిన బండ్లమూడి వినయ్, కనపర్తి కిరణ్‌కుమార్ కూడా హర్షవర్ధన్‌తోపాటు గంజాయి విక్రయిస్తున్నారు. ఒక్కో ప్యాకెట్ 50 గ్రాముల బరువు ఉంటుంది. ప్యాకెట్టును రూ.600కు విక్రయిస్తున్నారు. జేబులో పెట్టుకునేంత చిన్నపరిమాణంలో ఉండే ఎలక్ట్రానిక్ తూనికను గంజాయి బ్యాచ్ వినియోగిస్తున్నారు. పోలీసులే గంజాయి కొనుగోలుదారులుగా వెళ్లి విక్రయిస్తున్న యువకులను పట్టుకున్నారు. సమావేశంలో ఎస్సై వెంకటరవి పాల్గొన్నారు.

నరసరావుపేటలో..



అరెస్టు చేసిన నిందితుడితో పోలీసులు

నరసరావుపేట లీగల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నిందితుని అరెస్టు చేసినట్లు మొదటి పట్టణ సీఐ శనివారం తెలిపారు. పట్టణ మొదటి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటైన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం రాత్రి 9 గంటలకు నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుని వద్ద నుంచి 350 గ్రాముల గంజాయి, స్కూటీ, గతంలో వివిధ చోట్ల చోరీ చేసిన మరో ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మొత్తం సొత్తు విలువ సుమారు రూ. 6 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కేసులో మరో ఇద్దరిని అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు. నిందితుడిని కోర్టులో ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై వంశీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎదురెదురుగా ఢీకొన్న కార్లు : పాప మృతి



మృతి చెందిన ఆరాధ్య

ఈపూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో పసి పాప మృతి చెందగా మరో నలుగురు గాయపడిన సంఘటన కూచినపల్లి సమీపంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వినుకొండ మండలం చాట్రగడ్డపాడుకు చెందిన ఆళ్ల బ్రహ్మారెడ్డి తన కుటుంబంతో కలిసి హైదరాబాద్ నుంచి కారులో వస్తున్నాడు. వినుకొండ నుంచి కారంపూడి వెళ్తున్న కారు కూచినపల్లి సాయిబాబా గుడి వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో తాపస ఆరాధ్య(2) మృతి చెందగా, ఆళ్ల లక్ష్మీదుర్గా, విశృతరెడ్డి, బ్రహ్మారెడ్డి, ప్రవళికకు గాయాలైయ్యాయి. రెండు కారులు నుజ్జునుజ్జు అయ్యాయి. క్షతగాత్రులను ఈపూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేసి వినుకొండకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికల్లో ఘర్షణ



చికిత్స పొందుతున్న మేదరమెట్ల అనిల్

నూజెండ్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడు గ్రామంలో సాగునీటి సంఘాల ఎన్నికల విషయంలో తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య నెలకొన్న విభేదాలు ఘర్షణకు దారి తీశాయి. ఈ ఘర్షణలో ఉప సర్పంచి మేదరమెట్ల అనిల్, ఎండ్లూరి బాపనయ్య, గంగినేని శ్రీనివాసరావులకు గాయాలైయ్యాయి. వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎండ్లూరి మల్లికార్జున, ఎండ్లూరి శివాజీ, గంగినేని నరేంద్ర, ద్రోణాదుల నరేంద్ర, మేదరమెట్ల నాగేశ్వరరావు తమపై దాడి చేసినట్టు బాధితులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాగునీటి ఎన్నికల సందర్భంగా గ్రామస్థులు గ్రామంలోని 12 టీసీలు ఉండగా ఒక వర్గం వారికి ఐదు, మరో వర్గం వారికి ఏడు టీసీలు ఇచ్చే విధంగా నాయకులు ఒప్పందం చేసుకున్నారు. కాగా ఎన్నికల జరుగుతున్న సమయంలో పోలింగ్ కేంద్రం వద్ద తొమ్మిదో నంబరు టీసీకి బోడపాటి చిన వెంకటరావు నామినేషన్ వేయగా, మరో వర్గానికి చెందిన వారు నామినేషన్ వేయటానికి రావటంతో వాగ్వాదం మొదలైంది. ఒంటి గంటకు ఎన్నికలను పూర్తి చేసిన అనంతరం కొందరు పోలింగ్ కేంద్రంలోకి వచ్చి పోలింగ్ సిబ్బంది వద్ద ఉన్న పత్రాలను తీసుకోవటంతో అభ్యంతరం తెలిపిన వారిపై ప్రత్యర్థులు దాడి చేశారు. విషయం తెలుసుకున్న వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్ఐ బీవీ కృష్ణారావు గ్రామానికి వెళ్లి ఘర్షణను నివారించారు.



అట్టహాసంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల జన్మదిన వేడుకలు



నరేంద్ర కుమార్ దంపతులను గజమాలతో సత్కరిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

పొన్నూరు టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ జన్మదిన వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల నుంచే చింతలపూడిలోని ఎమ్మెల్యే గృహం కోలాహలంగా మారింది. భారీ సంఖ్యలో చేరుకున్న కార్యకర్తలు బాణసంచా పేల్చి పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఉదయం నుంచి పొన్నూరు పరిసర ప్రాంతాలకు చెందిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఎమ్మెల్యే గృహానికి వెళ్లి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పంచాయతీరాజ్ డీఈఈ ఎంఎన్ఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఇంజనీరింగ్ అధికారులు తరలివెళ్లి నరేంద్ర కుమార్, జ్యోతిర్మయి దంపతులను గజమాలతో సత్కరించారు. నియోజకవర్గంలోని పలు దేవాలయాలకు చెందిన అర్చకులు, వేద పండితులు ఎమ్మెల్యే దంపతులకు ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందించారు.

వివిధ విభాగాల అధికారులు..

సంగం డెయిరీ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, పట్టణంలోని పలు ప్రభుత్వ శాఖల అధికారులు, ఉపాధ్యాయుల సంఘాల నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు, ఆటో నగర్ అసోసియేషన్ నాయకులు, పండ్ల వర్తక సంఘం నాయకులు, ముస్లిం మైనార్టీలు, ఎన్‌సీసెల్ నాయకులు, పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన మహిళలు ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నరేంద్రకుమార్ పాల్గొని కేక్ కట్ చేశారు.

అన్నదానం

రవి ఫీ స్వీట్ హోమ్ అధినేత సయ్యద్ బాజీ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ ద్వారా 800 మందికి అన్నదానం చేశారు. ఇందిరా వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, ఆహారం పంపిణీ చేశారు.

విద్యార్థులు కుతూహలంతో చదువుకోవాలి

- కలలు కనేవారి కోసం ప్రపంచం స్వాగతం పలుకుతూనే ఉంటుంది
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్




సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిత్యం కుతూహలంతో, వినయంతో ఉండి చదువుకోవాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్‌శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని కలలుకనే వారి కోసం ప్రపంచం ఎప్పుడూ స్వాగతం పలుకుతూనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ కిస్మత్‌పురాలోని ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ 11వ గ్రాడ్యుయేషన్ డే శనివారం జరిగింది. కార్యక్రమానికి కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులందరికీ ఈరోజు కేవలం ఒక మైలురాయి మాత్రమే కాదని, వృత్తిపరమైన ప్రయాణాల్లో కీలకమైన క్షణమని చెప్పారు. ప్రపంచంలో చాలా తక్కువ మంది మాత్రమే తమ ప్రతిభను అందరికీ ఉపయోగపడేలా రూపకల్పన చేస్తారని, అలాంటి డాక్టర్ గుల్లపల్లి నాగేశ్వరరావు ఉద్వేగభరితమైన కల నుంచి ఈ సంస్థ ఆవిర్భవించిందన్నారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ లేకపోయి ఉంటే.. దేశంలో ఇంత గొప్ప ఎడ్యుకేషన్ నుంచి గ్రాడ్యుయేషన్ పొందే అవకాశం మీకు దక్కేది కాదన్నారు. గ్రాడ్యుయేషన్ పూర్తికావడంతో మీకు జీవితంలో కొత్త కెరియర్ ప్రారంభం కావడంతోపాటు కొత్త సవాళ్లు కూడా మొదలవుతాయని, ఎలాంటి సమస్యలు వచ్చినా ఎదుర్కొనేందుకు, సమాధానం ఇచ్చేందుకు సహనం, ఓర్పుతో వ్యవహరించాలని సూచించారు. గ్రాడ్యుయేషన్ చదువుకు ఎండ్‌పాయింట్ కాకుండా, ఇక్కడి నుంచి మీరు ప్రతిరోజూ ఏదో ఒక విషయాన్ని నేర్చుకుంటూ నిత్య విద్యార్థిలా ఉండాలన్నారు. తాను కూడా చిన్న మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన వాడినేనని, 25 ఏళ్ల క్రితం మీలాగే ఇలాంటి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఎన్నో ఆశలతో కూర్చున్నానని చెప్పారు. ఆ సమయంలో చదువుకునేందుకు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని తెలిపారు. ప్రతి సవాలుకు పరిష్కారం ఉంటుందని, అందుకే విద్యార్థులు ప్రతినిత్యం కుతూహలంగా ఉండాలన్నారు. కార్యక్రమం అనంతరం గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన విద్యార్థులకు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సర్టిఫికెట్లు అందజేశారు.

లోక్ అదాలత్‌లో 2759 కేసులు పరిష్కారం

గుంటూరు (లీగల్), డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాల్లోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో కడపటి సమాచారం మేరకు 2759 కేసులను రాజీ మార్గంలో పరిష్కరించారు. ఇంకా కొన్ని కోర్టులలో కేసులను న్యాయమూర్తులు పరిష్కరిస్తూ ఉన్నారు. సివిల్ కేసులు 258, క్రిమినల్ 1898, చెక్ బౌన్స్ కేసులు 194, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు 150, కార్మిక వివాదాలు 7, వివాహ సంబంధ కేసులు 64, బ్యాంకు కేసులు 56తోపాటు 129 ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించారు. ఈ కేసుల పరిష్కారం ద్వారా రూ.47 కోట్ల 13 లక్షల 11 వేల 302ల మేరకు కక్షి దారులకు లబ్ధి చేకూరిందని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి. లీలావతి తెలిపారు. ఫిజికల్, వర్చ్యువల్ పద్ధతిలో నిర్వహించిన ఈ జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కావటానికి సహకరించిన న్యాయ వాదులకు, పోలీస్ సిబ్బందికి, ప్రభుత్వ సంస్థలకు కక్షిదారులకు, న్యాయస్థాన సిబ్బందికి, న్యాయ సేవాధికార సంస్థ తరుపున ఆమె ధన్యవాదాలు తెలిపారు.

దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు.. సమయ పాలన పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అప్పలరాజు

రేపల్లె, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): దూరప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ సర్వీస్‌లు కార్మికుల పనితనంతో సమయపాలన పాటించే విధంగా గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.అప్పలరాజు అన్నారు. శనివారం రేపల్లె ఆర్టీసీ డిపోను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేపల్లె ప్రాంతం నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సులు సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్మికులు ఆర్టీసీని అభివృద్ధి బాటలో నడిపే విధంగా కృషి చేయాలని సూచించారు. సమయపాలన మాసోత్సవాలు ఒక నెల కాదనీ, అది నిరంతర ప్రక్రియ అని ఆర్టీసీ కుటుంబ సభ్యులు తెలుసుకోవాలన్నారు. తీరప్రాంతంలోని రేపల్లె డిపో ఆర్థికంగా బల పడే విధంగా అన్ని సంఘాల నాయకులు, కార్మికులు పని చేయాలని సూచించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటారు. కార్యక్రమంలో గుంటూరు డీపీటీవో ఎం.రవికాంత్, ఇన్‌ఛార్జి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, అన్ని యూనియన్ల అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచార కేసులో నిందితులు అరెస్టు

కొల్లూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం చేసిన నిందితులను డీఎస్పీ శ్రీనివాసరావు అరెస్టు చేసినట్లు శనివారం ఎస్ఐ ఏడుకొండలు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 26న కొల్లూరు మండలానికి చెందిన ఓ బాలికపై జరిగిన అత్యాచారం కేసులో ఆవులవారిపాలెం క్రీస్తులంకకు చెందిన ముద్దాయిలు విప్పర్ల ప్రేమ్‌కుమార్ అలియాస్ విక్కీ, బెజ్జం శ్యాంకుమార్ ఉరఫ్ శ్యాంబాబు కొల్లూరు కరకట్ట వద్ద ఉన్న బస్టాప్‌లో ఉన్నట్లు శుక్రవారం రాత్రి సమాచారం అందడంతో డీఎస్పీ, వేమూరు సీఐ వీరాంజనేయులు, ఎస్ఐ ఏడుకొండలు, సిబ్బందితో దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీన పరుచుకున్నారు. నిందితులను శనివారం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.30
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



మాచవరం మండలం వేమవరంలో నీటి సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు అధికారుల నుంచి ధ్రువ పత్రం అందుకుంటున్న గల్లా లాజర్

సాగునీటి సంఘాల ఎన్నికల్లో

అన్నింటా ఏకగ్రీవాలే !

పిడుగురాళ్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గ పరిధిలో 37 సాగునీటి సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నికల్లో ఆయా సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్ష, సభ్యుల ఎన్నికకు ఒక్కొక్కరే అభ్యర్థులు నామినేషన్ వేయడంతో పదవులన్నీ ఏకగ్రీవమయ్యాయి. ఆయా సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల వివరాలు వరుసగా.. 33వ సాగునీటి సంఘానికి షేక్ మహబూబ్ షరీఫ్, సంకుల మంగయ్య, 34కి గండికోట వెంకటేశ్వర్లు, నెక్కంటి మాధవి, 35కి గోళ్ల ఆదినారాయణ, కామిశెట్టి అమరలింగేశ్వరరావు, 36కి భవిరిశెట్టి శివన్నారాయణ, చల్లగుండ్ల శ్రీనివాసరావు, 37కి బడిగుంచల చౌడయ్య, జనగం అనంతలక్ష్మీ, 38కి ఆవుల ఏడుకొండలు, గొళ్లపల్లి నాగేశ్వరరావు, 39కి గుడె వెంకటేశ్వర్లు, షేక్ సుభాని, 40కి బొజ్జా సత్యనారాయణ, సయ్యద్ జాన్, 41కి ముంగి వెంకటేశ్వర్లు, యామని రాంబాబు, 13వ జానపాడు చెరువు ట్యాంక్‌కి బండ్ల శ్రీనివాసరావు, షేక్ గురజాల మస్తాన్, 15వ కోనంకి ఆయకట్టుకి నందిపాటి రమణారెడ్డి, దగ్గుల మంగమ్మ, 58కి నందిపాటి శ్రీనివాసరెడ్డి, పుణ్యాల గోవిందరెడ్డి. కాగా 14వ జానపాడు ఎర్రవాగు ఆయకట్టుకి ఎవరూ నామినేషన్ దాఖలు చేయ లేదని ఎన్నికల అధికారులు దయాసాగర్, సాగర్‌బాబులు తెలిపారు.

దాచేపల్లి మండలంలో...మండలంలోని తంగెడ, రామాపురం మేజర్ల పరిధిలోని సాగునీటి సంఘాల అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి వివరాలు వరుసగా.. దాచేపల్లిలో తంగెడమేజర్ పరిధిలో దాచేపల్లి-1(47నెంబరు)కి పగడాల భాస్కరరావు, పసుపులేటి నరసింహస్వామి, దాచేపల్లి-2(50 నెంబరు)కి చింతపల్లి గౌస్, సుద్దపల్లి సూర్యచంద్రరావు, కేశానుపల్లి-1(45 నెంబరు)కి కర్నాటి నరేంద్ర, మునగా శ్రీను, కేశానుపల్లి-2(46 నెంబరు)కి బండి శ్రీనివాసరావు, కొప్పుల శ్రీను, పెదగార్లపాడు (43 నెంబరు)కి ఇమ్మడిశెట్టి చినబ్రహ్మయ్య, నూకాబత్తిన సాంబయ్య, తంగెడ-1 (49నెంబరు)కి షేక్ యంపరాల హుస్సేన్, గోళ్లసైదులు, తంగెడ-2(52 నెంబరు)కి పాశం వెంకటరెడ్డి, తోట వెంకటేశ్వర్లు, మాదినపాడు (48 నెంబరు)కి పతకమూరి ఫణీంద్ర, ఎర్రబెల్లి చినసైదులు, పొందుగల (26 నెంబరు)కి ఆకూరి వెంకటరెడ్డి, సయ్యద్ మౌలాలి, గామాలపాడు (25 నెంబరు)కి బండి కాంతారావు, సంగం అంజి, దాచేపల్లి (60 నెంబరు)కి శౌంఠెం శివనాగేశ్వరరావు, కొప్పుల వెంకటేశ్వర్లు, దాచేపల్లి (59 నెంబరు)కి చిన్నంరాజు లక్ష్మీ, బాణావత్ శంకర్‌లు ఎన్నికయ్యారు.

గురజాల మండలంలో.. మండల పరిధిలో 12 నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవమైంది. వాటివివరాలు వరుసగా.. మాడుగుల సంఘానికి చావా రామారావు, సూదిరెడ్డి లక్ష్మయ్య, గురజాల-10కి ఉడుముల నర్సిరెడ్డి, ఇల్పూరి కోటేశ్వరరావు, గొట్టిముక్కల-12కి ఆవుల పెద కాశయ్య, రొండి గురవయ్య మాడుగుల-13కి యాగంటి రామారావు, పోట్ల అలేఖ్య గురజాల-14కి జంపాని అమరలింగారావు, పోలు పరదేశిరెడ్డి, గంగవరం-15కి గోళ్ల శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ధైద-16కి రాయపాటి నాగేశ్వరరావు, కొమ్మూరి వెంకటేశ్వర్లు, చర్లగుడిపాడు-20కి నారంచెర్ల లక్ష్మీనారాయణ, వల్లెపుశెట్టి శ్రీను, గోగులపాడు-21కి రెడ్డిచర్ల పాపిరెడ్డి, రెడ్డిచర్ల అప్పిరెడ్డి, పల్లెగుంత-22కి గోళ్ల శ్రీనివాసరావు, జాస్తి వెంకటేశ్వర్లు, గంగవరం-23కి పులికూరి కాంతారావు, జాస్తి వెంకటసైదయ్య, పులిపాడు-24కి పోట్ల వెంకటేశ్వర్లు, లింగా బాలయ్య. కాగా తహసీల్దార్ నగేష్ ఆయా ప్రాంతంల్లో ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించారు.

మాచవరం మండలంలో.. మండలంలోని 10 నీటి సంఘాలకు నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవమైనట్లు తహసీల్దార్ క్షమారాణి తెలిపారు. పిల్లుట్ల - 16 మైనర్ అధ్యక్షుడిగా మేనావత్ బాలాజీ నాయక్, ఉపాధ్యక్షుడిగా ఎన్ మంత్రునాయక్, పిన్నెల్లి - 19కి పొందుల పకీర, జీ గౌస్, పిన్నెల్లి- 17కి చింతపల్లి పెద మాబూసుభానీ, ఎస్కే ఇమామ్‌బీ, వేమవరం-18కి గల్లా లాజరు, పీ వెంకటేశ్వర్లులు, పిల్లుట్ల-40 మేజరుకి బొజ్జా సత్యనారాయణ, ఎస్కేఎం సయ్యద్ జాన్, పిల్లుట్ల-36కు భవిరిశెట్టి శివన్నారాయణ, సీహెచ్ శ్రీనివాసరావు, మాచవరం-38కి ఆవుల ఏడుకొండలు, జీ.నాగేశ్వరరావు, మాచవరం- 39కి గుడె వెంకటేశ్వర్లు, ఎస్కే సుభానీ, పిన్నెల్లి-51కి పిక్కిలి పూర్ణచంద్రరరావు, ఈ.కనికారెడ్డి, ఆకురాజు పల్లి - 41కి ముంగి వెంకటేశ్వర్లు, వైరాంబాబులు ఎన్నికైనట్టు తహసీల్దార్ తెలిపారు.

వ్యక్తిపై దాడి..

మాచర్లటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 13వ వార్డుకు చెందిన దుర్గారెడ్డి శనివారం రాత్రి ద్విచక్రవాహనంపై పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వైపుగా వస్తుండగా హైస్కూల్ వద్ద పట్టణానికి చెందిన శివనాగరాజు, అతని సోదరుడుతో పాటు మరో నలుగురు అతడిని అడ్డుకొని కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ దాడిలో దుర్గారెడ్డికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అనంతరం నరసరావుపేటకు తరలించారు.

నేడు ఎమ్మెల్యే రాక..

గురజాలటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం ఉదయం 10:45 గంటలకు పట్టణంలోని పంచాయతీ గెస్ట్‌హౌస్‌కు రానున్నారు. అనంతరం కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావులతో కలిసి పట్టణంలో వేంచేసియున్న శ్రీపాతపాటేశ్వరి అమ్మవారిని దర్శించుకొని పూజల్లో పాల్గొననున్నారు.

బెల్లంకొండ, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్ర మైన బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద కోళ్ళూరి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం సమీపంలో ఆదివారం జరుగనున్న కళ్యాణ మండపం భూమి పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానంద రెడ్డి విచ్చేస్తున్నట్టు ఆలయ ఈవో వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

భారీ వాహనాలకు

అనుమతి లేదు

గురజాలటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసియున్న పాతపాటేశ్వరమ్మ తిరునాళ్లను పురస్కరించుకొని ఆది, సోమవారాలు పట్టణంలోకి భారీ వాహనాలను అనుమతించడం లేదని సీఐ ఆవుల భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరునాళ్ల కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పట్టణంలోకి భారీ వాహనాలను అనుమతించడం లేదన్నారు.

విద్యుత్ భారాలపై

19న నిరసన ప్రదర్శన

సత్తెనపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచటం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయటాన్ని ఈనెల 19న నిరసన ప్రదర్శన, తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ కమిటీ సభ్యులు గద్దె చలమయ్య అన్నారు. శనివారం పుతుంభాక భవన్‌లో విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పై వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం జరిగింది. సమావేశానికి సీపీఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల అధ్యక్షత వహించారు. సమావేశంలో పెండ్యాల మహేష్, అశోక్, ఇర్మియా, చిట్టిబాబు, గద్దె ఉమశ్రీ, గుంటుపల్లి రజిని, రాజ్ కుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల్లో టీడీపీదే హవా !



మాచర్ల మండలం తాళ్లపల్లి నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు

- సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతం
- అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవం
- ఎక్కడా కనిపించని వైసీపీ నేతలు

మాచర్లటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గ పరిధిలో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గంలో మొత్తం 24 నీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. మాచర్ల మండలంలో 5, రెంటచింతల మండలంలో 6, దుర్గి మండలంలో 2, వెల్దుర్తి మండలంలో 4, కారంపూడి మండలంలో 7 నీటి సంఘాలు ఉన్నాయి. అన్ని చోట్లా టీడీపీ నేతల హవానే నడిచింది. ఆయా చోట్ల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే ఎక్కడా వైసీపీ నేతలు కనిపించలేదు.

మాచర్ల మండలంలో... మాచర్ల మండల పరిధిలో మూడు మేజరు, రెండు మైనర్ కాలువలు ఉన్నాయి. ఆయా సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యాకులు వరుసగా.. తాళ్లపల్లికి కొప్పుల లింగయ్య, పండ్ల సైదులు, కంభంపాడు-1కి కూరాకుల గోవిందయ్య, రామయ్య, కంభంపాడు-2కి కోక జయరాం, దొండేటి మల్లారెడ్డి, మాచర్లకి ముక్కా సోమయ్య, వీర్ల జానయ్య, కొత్తపల్లికి అల్లం కొండారెడ్డి, గొల్లమారి శ్రీనివాసరెడ్డిలు ఏకగ్రీంగా ఎన్నికయ్యారు.

రెంటచింతల మండలంలో... మండలంలోని 6 సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పాలువాయి అసిస్టెంట్ ఎన్నికల అధికారి పల్లారామకృష్ణ తెలిపారు. ఆయా సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల వివరాలు.. తుమ్మకోటకి పోట్ల నరసింహారావు, కొంగర నాగేశ్వరరావు, రెంటాలకి మద్దిగపు పిచ్చిరెడ్డి, దాచినేని అమర బాబు, మిట్టగుడిపాడుకి సింహాద్రి బాపూజీ(గురజాల), గోవిందరెడ్డి(తేలుకుట్ల), రెంటచింతలకి తుమ్మా ఎలీషా జోజిరెడ్డి, షేక్ వలి, పశర్లపాడుకి వెంపటి హనుమంతరావు, గోళ్ల మల్లయ్య, పాలువాయికి బెల్లంకొండ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడి ఎంపిక చేయలేదు.

దుర్గి మండలంలో... మండల పరిధిలో 2 సాగునీటి సంఘాలు ఉండగా, ఓబులేశునిపల్లె అధ్యక్షునిడిగా పునాటి భాస్కర్, ఉపాధ్యక్షుడిగా కిన్నెర మరియమ్మ, ఆత్మకూరుకి బూసాని లింగయ్య, గోళ్ల శివయ్య ఎన్నికయ్యారు.

వెల్దుర్తి మండలంలో... వెల్దుర్తి మండల పరిధిలో 4సాగునీటి సంఘాలకు ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు వరుసగా.. పట్టీవీడుకి వెంకటరెడ్డి, విజయలక్ష్మీ, వజ్రాలపాడుకి ఇస్లావత్ లక్ష్మానాయక్, దేశావత్ కృష్ణానాయక్, గంగిరెడ్డిపల్లెకి జూలకంటి జయరామిరెడ్డి, జవిశెట్టి కోటయ్య, గుడిపాడుకి శీలంపున్నమ్మ, ఉడతల లక్ష్మమ్మ ఎన్నికయ్యారు.

కారంపూడి మండలంలో... కారంపూడి మండలపరిధిలో 7 సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపా ధ్యక్షుల వివరాలు వరుసగా.. చినగార్లపాడుకి నంద్యాల శ్రీనివాసరెడ్డి, చల్లా శ్రీనివాసరావు, మిర్యాల-1కి కొనకంచి పూర్ణచంద్రరావు, మేకల వెంకటరెడ్డి, మిర్యాల-2కి దొడ్డా చినరమణ, నలబోతు సీతారామయ్య, ఒప్పిచర్లకి పంగులూరి అంజయ్య (ఒప్పిచర్ల), పాతూరి గురవయ్య, చింతపల్లికి పంగులూరి అంజయ్య (చింతపల్లి), కొత్తపల్లి వెంకటేశ్వర్లు, పెదగార్లపాడుకి పర్లా సాంబశివరావు, రాజధాని శ్రీనివాసరావు, కారంపూడికి కోదాటి పోలయ్య, బొమ్మిన శేషగిరి ఎన్నికయ్యారు.

నీటి సంఘాల ఎన్నికలు ఏకపక్షం

- అన్ని స్థానాలు టీడీపీ మద్దతుదారుల కైవసం



అధ్యక్షుడిగా నియామక పత్రాన్ని అందుకుంటున్న సాతులూరు చిన్న అప్పారావు

సత్తెనపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నియోజకవర్గం పరిధిలో నీటి సంఘాలకు నిర్వహించిన ఎన్నికలు ఏక పక్షంగా, ఏకగ్రీవాలతో ముగిశాయి. సత్తెనపల్లి మండలంలో 15, నకరికల్లు మండలంలో 9, రాజుపాలెం మండలంలో 6, ముప్పాళ్ళ మండలంలో 8 నీటి సంఘాలను టీడీపీ మద్దతుదారులే కైవసం చేసుకున్నారు. ఆయా సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల వివరాలు వరుసగా..

సత్తెనపల్లి మండలంలో.. భృగుబండ ట్యాంకుకి అధ్యక్షుడిగా పాముల వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడిగా మేకల వెంకటేశ్వరరావు, ధూళ్ళిపాడు -1కి చిమటా శివబ్రహ్మయ్య బద్దుల హనుమంతరావు, పాకాలపాడు -1కి కాల్వపల్లి శ్రీనివాసరెడ్డి, షేక్ జానీ వలి సాహెబ్, కట్టమూరుకి చెన్నమల్లు మోహన్‌బాబు, మాడిశెట్టి శ్రీనివాసరావు, ధూళ్ళిపాళ్ళ -2కి భైరపు తిరుపతిరావు, బత్తుల హనుమంతరావు, పాకాలపాడు -2కి కొతారుసాంబశివరావు, కొతారు అంజయ్య, ఎల్.గార్లపాడుకి గుంటూరు రమేష్, సత్తెనపల్లి పోతురాజు, నందిగామకి కట్టా శంకరరావు, మాదాల నాగమల్లేశ్వరరావు, గుడిపూడికి మందడపు లింగయ్య, గద్దె రాజశేఖర్, భీమవరంకి బొద్దు రవి కుమార్, అడుసుమల్లి తిరుపతమ్మ, నందిగామ-2కి నందిగామపెద్దబ్బాయి, నాదెండ్ల చెన్నకేశవులు, అబ్బూరుకు గరికపాటి జనార్ధనరావు, ఎం ఉమామహేశ్వరరావు, ఫణిదంకి మందడి నరసింహారావు, ఎం శ్రీనివాసరావు, ఫణిదం -2కి నిమ్మగడ్డ లక్ష్మీనారాయణ, పీ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.

నకరికల్లు మండలంలో.. మండలంలోని 9 సాగు నీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తహసీల్దార్ కే పుల్లారావు తెలిపారు. వారి వివరాలు.. కుంకలగుంట ఎర్ర నల్లచెరువు -56కి రుసుం కోటయ్య, మర్రివేముల చిన బుచ్చారావు, కుంకులగుంట - 187కి కొమ్మూరి కొండలు, మిద్దెం లక్ష్మీనారాయణ, కుంకలగుంట - 188కి సాతులూరి చిన అప్పారావు, కొండవర్తి నాగేశ్వరరావు, రూపెనగుంట్ల- 83కి తొండపి గురవయ్య, ఎండూరి చెన్నయ్య, రూపెనగుంట్ల -153కి వడ్లమూడి హనుమంతరావు, నరిశెట్టి సుందరరాజు, చల్లగుండ్ల -78కి నూతి వీరాంజనేయులు, కేతినేని నాగేశ్వరరావు, చేజర్ల బేతరాజు చెరువు-57కి సింబోతుల వెంకటరావు, పమ్మి కృష్ణారెడ్డి, గుండ్లపల్లి - 54కి జినుగు వెంగళరెడ్డి, షేక్ సుభానీ, గుండపల్లి - 32కి బత్తుల చిన అప్పారావు, గంగినేని వెంటరావు.

ముప్పాళ్ళ మండలంలో.. తొండపి - 11 ఎంఐ ట్యాంక్ నీటి సంఘం అధ్యక్షుడిగా చల్లాశ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా నలబోతు బ్రహ్మయ్య, దమ్మాలపాడు-85కి యామినేని నిమ్మారావు, మూలిపూరి పెద వెంకయ్య, తొండపి -86కి అలపర్తి వెంకటేశ్వర్లు, డీ శ్రీనివాసరావు, 88 ముప్పాళ్ళకి గోనుగుంట్ల చెంచయ్య, నాము మత్స్య వల్లభరాయుడు, తొండపి- 3కి చల్లా వెంకట కోటయ్య, కొత్త రామారావు, మాదల-1కి గోగినేని కోటేశ్వరరావు, మధిర రామకృష్ణారెడ్డి, మాదల-2కి బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, మాదల - 3 ఎన్నిక వాయిదా పడింది.

రాజుపాలెం మండలంలో.. ఉప్పలపాడు నీటి వినియోగదారుల సంఘం నెంబరు-54కి అధ్యక్షుడిగా తెల్లగొర్ల ఏడుకొండలు, ఉపాధ్యక్షుడిగా నర్రా వెంకటేశ్వర్లు, గణపవరం -55కి కమ్మాశ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, కుబాద్‌పురంకి అంచుల శివ లక్ష్మీ, చింకా వాసు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులకు అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.


క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించాలి

- డీఎంహెచ్ఓ డాక్టర్ రవి
- పీహెచ్‌సీ, ఆరోగ్య ఉపకేంద్రంలో తనిఖీ



ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ రవి

రెంటచింతల, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): ముందస్తు పరీక్షలతో క్యాన్సర్‌ను గుర్తించి తొలిదశలో చికిత్స అందిస్తే నివారణ సాధ్యమేనని డీఎంహెచ్‌వో డాక్టర్ రవి అన్నారు. శనివారం మండల కేంద్రమైన రెంటచింతలలోని పీహెచ్‌సీని, ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వివిధ రోగాల నిర్ధారణకు చేసే ప్రతి పరీక్షను నిక్కచ్చిగా ఖచితమైన ఫలితం ఉండేలా చూడాలని వైద్యులను ఆదేశించారు. క్యాన్సర్ నిర్ధారణకు ఇప్పటి వరకు ఎన్ని గృహాలు సర్వే చేశారన్న సమాచారాన్ని, సదరు వ్యక్తి బరువు, ఎత్తు, ఆహారపు అలవాట్లు అడిగి తెలుసుకుని ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఆస్పత్రిలోని వివిధ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు ఎస్.కృష్ణారెడ్డి, ప్రదీప్‌కుమార్ రెడ్డి, రమాదేవి, హనుమకుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు ఎస్ కోటేశ్వరరావు, లక్ష్మీ ప్రసన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కుట్టు మిషన్లు పంపిణీ

రాజుపాలెం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజుపాలెంలోని పద సేవా సంస్థ, స్థానిక యూనియన్ బ్యాంక్ సంయుక్త సహకారంతో శనివారం 60 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, 30 మంది కి కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూని యన్ బ్యాంక్ మేనేజర్ భగత్, పద సేవా సంస్థ డోనర్ ముర్రేస్మైకాల్, సంస్థ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ టీ యోహన్ రాజు, పుష్పా సంస్థ బోర్డు మెంబర్ గుమ్మడి శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలపై

ఆటో డ్రైవర్లకు అవగాహన

దాచేపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నడికూడి రైల్వేస్టేషన్ ఆటో యూనియన్ సభ్యులతో దాచేపల్లి సీఐ భాస్కరరావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐ భాస్కరరావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు మద్యం తాగి డ్రైవింగ్ చేయరాదని, ర్యాష్ డ్రైవింగ్ చేయడం ద్వారా ప్రమాదాలకు అవకాశం ఎక్కువగా వుందన్నారు. అనుమానాస్పద వ్యక్తులను ఎక్కడైనా గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను, ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ఆటోలకు రికార్డులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో సీఐతో పాటు ఎస్ఐలు సౌందర్‌రాజన్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గురజాల తిరునాళ్ల

- హాజరు కానున్న ప్రజాప్రతినిధులు



విద్యుత్ కాంతులతో పాతపాటేశ్వరి అమ్మవారు ఆలయం

గురజాలటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాతపాటేశ్వరి అమ్మవారి జాతర గురజాల తిరునాళ్లగా ప్రసిద్ధి. సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం గురజాల పట్టణంలో దుగ్గరాజు వంశీకులు ఆలయాన్ని నిర్మించినట్లు ఆలయంలోని శాసనాల ద్వారా తెలుస్తోంది. క్రీ.శ. 11వ శతాబ్ధంలో పల్నాటి నాయకురాలైన నాగమ్మ ఈ అమ్మవారికి భక్తి ప్రపత్తులతో పూజలు జరిపినట్టు పెద్దలు చెబుతూ ఉంటారు. వీరశైవ భక్తురాలైన నాగమ్మ గురజాల గ్రామంలో ఉన్న శ్రీ ముక్కంటేశ్వరుడు, శ్రీ వీరభద్రస్వామి, శ్రీ పాతపాటేశ్వరి అమ్మవార్లను కొలిచినట్లు ఆలయశాసనాల ద్వారా తెలుస్తోంది. ఎంతో మహిమాన్వితమైన ఈ పుణ్యక్షేత్రం శిథిలమై తిరిగి 1826వ సంవత్సరంలో అప్పటి కలెక్టర్ ఓక్స్ దొర అమ్మ వారి మహిమలకు ముగ్ధుడై నిత్య నైవేద్య దీపారాధనల నిమిత్తం సుమారు 40 ఎకరాల భూమిని ఇనాముగా ఇచ్చారు. ఆదివారం ఆలయంలో సిడిమాను ఉత్సవం జరపనున్నారు. ఇదే రోజున గురజాల తిరునాళ్లగా ప్రజలు జరుపుకుంటారు. గురజాల శాసన సభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు, టీటీడీ పాలకవర్గ సభ్యుడు జంగా కృష్ణమూర్తిలు విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొననున్నారు.



కోర్టు ప్రాంగణంలో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్

జాతీయ లోక్ అదాలత్‌లో

227 కేసులు పరిష్కారం

మాచర్లటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ ఆధ్వర్యాన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 227 కేసులు పరిష్కరించారు. ఇందులో సివిల్ 13, ఈపీలు 3, మనోవర్తి 3, క్రిమినల్ 57, ఎక్సైజ్ 35, ఇతర ప్రిమినల్ కేసులు 114, టెలిఫోన్ 3, బ్యాంకు కేసులు 2 ఉన్నాయి. ఈ అదాలత్‌లో న్యాయవాదులు పుల్లారావు, గట్ల సత్యనారాయణరెడ్డి, కేశం శ్రీనివాసరావు, బాలజోజి, గాలీబుసాహెబ్, కృష్ణమూర్తి, వరప్రసాదరావు, అనిల్, జాని పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

సత్తెనపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మాల మహానాడు ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాల కార్పోరేషన్ చైర్మన్ డాక్టర్ పెదపూడి విజయ కుమార్, పల్నాడు ఇల్లా డీఆర్‌వో మురళీ, జాతీయ మాల మహానాడు అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్‌లు పాల్గొని క్రిస్మస్ సందేశాన్ని అందించారు. కలగల మృత్యుంజయరావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు.

గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో

గుర్తు తెలియని మృత దేహం

ముప్పాళ్ళ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటూరు బ్రాంచ్ కెనాల్ పవర్ ప్లాంట్ లాక్‌ల వద్ద గుర్తు తెలియని మృత దేహాన్ని స్థానికులు గుర్తించి శనివారం పోలీసులకు సమాచారం అందజేశారు. వీఆర్‌వో మాబూవలి ఫిర్యాదు మేరకు ముప్పాళ్ళ ఎస్ఐ సోమేశ్వరరావు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని, మృతుని శరీరం ఉబ్బిపోవటంతో గుర్తు పట్టలేని విధంగా ఉందని, నీటిలో పడి సుమారు నాలుగు రోజులకు పైగా అయి ఉంటుందని తెలిపారు. మృతుడి ఒంటిపై గోధుమరంగు బారు చేతులచొక్కా, చొక్కాపై ఆకు పచ్చగీతలు ఉన్నాయన్నారు. మృతదేహాన్ని ఆస్పత్రికి ఉబ్బి పోస్టుమార్టంకు తరలించేందుకు వీలుగా లేకపోవటంతో డాక్టర్‌ను పిలిపించి అక్కడే పోస్టుమార్టం నిర్వహించామని తెపారు. మృతదేహాన్ని కాలువగట్టుపై పూడ్చి పెట్టామన్నారు.



ఎన్నిక పత్రాన్ని అందుకుంటున్న అత్తలూరు సాగునీటి సంఘ అధ్యక్షుడు హనుమంతరావు

ప్రశాంతంగా సాగు నీటి ఎన్నికలు

- కూటమి మద్దతు దారులు ఏకగ్రీవం

పెదకూరపాడు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అమరావతి మేజరు, నరసింగపాడు, లింగంగుంట్ల మేజర్ల పరిధిలో సాగునీటి సంఘాలకు నిర్వహించిన ఎన్నికల్లో అన్నిస్థానాల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు తహసీల్దార్ మీసాల డానియేలు తెలిపారు. లింగంగుంట్లలో 100వ సాగు నీటి సంఘానికి అధ్యక్షుడిగా యాదగిరి రామచంద్రరావు, ఉపాధ్యక్షుడిగా బోడపాటి శ్రీనివాసరావు, పాటిబండ్ల-109కి పెనుముచ్చు అనీల్, రాళ్ళపల్లి అభినంద, బలుసుపాడు 110కి భాష్యం శ్రీనివారావు, ఘంటా సాంబశివరావు, బలుసుపాడు - 111కి యలమంచిలి రామకృష్ణ చౌదరి, షేక్ ఖాదర్ బాషా, లగడపాడు- 118కి వడ్లమూడి అప్పారావు, గోగులపాటి సాంబశివరావు, పెదకూరపాడు -119కి కొమ్మినేని వెంకటేశ్వర్లు, మాబూ జాన్, ముస్సాపురం -120కి బోడపాటి బాల రమేష్, దాసరి చినకోటయ్య, హుస్సేన్‌నగర్ - 121కి పూట్లపల్లి నాగేశ్వరరావు, ఎం రమేష్, 75 తాళ్ళూరు-123కి నంబూరు పుల్లారావు, దేవినేని కోటేశ్వరరావు, కాశిపాడు - 124కి మాదినేని చిన్నారావు, మల్లెల శ్రీరాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అమరావతి (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఏడు సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యాక్షుల ఎన్నిక ఏకగ్రీమైంది. ఉంగుటూరు సాగునీటి సంఘానికి అధ్యక్షుడిగా వంగా రామిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా పల్లపాటి రాజు, మల్లాదికి భవిరిశెట్టి వెంకటేశ్వరరావు, అరికట్ల వెంకటశివరావులు, దిడుగుకి పతకమూరి రామారావు, వాసా వెంకటేశ్వరరావు. ధరణికోట-1కి వట్టికుంట అంకమ్మరావు, చుండు రమేష్ బాబు. ధరణికోట-2కి అన్నం నాగేశ్వరావు, అమ్మిశెట్టి నారాయణ. పెదమద్దూరుకి ఉదారి కృష్ణ, పొదిల అప్పారావు. అత్తలూరుకి బయ్యపునేని హనుమంతరావు తాడిబోయిన సైదులు ఎన్నికయ్యారు.

అచ్చంపేట (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొమ్మిది సాగు నీటి సంఘాలు శనివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షుడు, టీసీలను సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పెదపాలెం అధ్యక్షుడిగా నెల్లూరు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా నెల్లూరు కొండలు, చింతపల్లికి జమ్మిశెట్టి నాగేశ్వరరావు, ఎస్కే బాబు, చామర్రు - 8కి రావూరి భద్రయ్య సురె పుణ్యవతి, చిగురుపాడుకి ఆరుద్ర గంగాధరరావు, సిద్ది కోటేశ్వరరావు, చామర్రు-73కి పసుపులేటి పాపిరెడ్డి, కొనకంచిసాయి బాబు, వేల్పూరు-3కి కూకట్లగోపీ, అన్నంశ్రీనివాసరావు, వేల్పూరు-1కి మన్నెం శ్రీనివాసరావు, నల్లపాటి సాంబశివరావు, వేల్పూరు-2కి కిలారి వెంకటేశ్వర్లు, బొల్లేపల్లి గోవిందు, అంబడిపూడికి తాళ్ళూరి మురళీ, బోదెల హనిమిరెడ్డి ఎన్నికయ్యారు.

బెల్లంకొండ (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండలో నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఇద్దరు అధ్యక్షులు, ఇద్దరు ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవమైనట్టు తహసీల్దార్ మున్నీసా బేగం తెలిపారు. బెల్లంకొండ సాగునీటి సంఘం అధ్యక్షుడిగా షేక్ ముస్తఫా, ఉపాధ్యక్షుడిగా బూతుకూరి గోవిందరెడ్డి, పాపాయపాలెంకి బిట్రగుంట కోటేశ్వరమ్మ, సింగారెడ్డి బ్రహ్మారెడ్డి ఎన్నికైనట్టు తెలిపారు.

క్రోసూరు (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు మైనర్ ఇరిగేషన్ చెరువు అధ్యక్షుడిగా పరిశ రాంబాబు, ఉపాధ్యక్షుడిగా కంభంపాటి కోటేశ్వరరావు, ఎర్రబాలెం ఇసుక వాగుకి వేపూడి శంకరరావు, పగడాల గంగయ్య, 88 తాళ్ళూరుకి మాగంటి అప్పారావు, పులమాల పుల్లారావు, పీసపాడుకి పొన్నెకంటి శివరావు, మక్కెన గంగాధరరావు, ఉయ్యందనకి యకటాల విష్ణుమూర్తి, ఉప్పు శివపార్వతి, ఉయ్యందన డైవర్షన్ చానల్‌కి ఏల్చూరి కళ్యాణి, అందుకూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కి అధ్యక్షుడిగా దిగుమర్తి తిరుమలరావు ఎన్నికయ్యారు. అలాగే ఊటుకూరు సాగు నీటి సంఘం అధ్యక్షుడిగా చల్లా సురేష్, ఊటుకూరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కి కందుల నాగేశ్వరరావ, వేల్పూరు - 1కి మన్నెం శ్రీనివాసరావు, వేల్పూరు -2కి కిలారి వెంకటేశ్వర్లు, మిట్టపాలెం అధ్యక్షుడిగా డీ సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా మందడపు రామకృష్ణలు ఎన్నికయ్యారు. వీరికి తహసీల్దార్ శ్రీనివాస యాదవ్ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

నేడు పల్నాటి పెద్దాయన

యరపతినేని లక్ష్మయ్య విగ్రహావిష్కరణ

- మంచికల్లుకి ఎంపీ, ఎమ్మెల్యేలు రాక..



యరపతినేని లక్ష్మయ్య (ఫైల్)

రెంటచింతల,డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పల్నాట పెద్దాయనగా పేరుగాంచిన గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తండ్రి యరపతినేని లక్ష్మయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం రెంటచింతల మండలం, మంచికల్లు గ్రామంలో జరుగనుంది.

అప్పటి సీఎం ఎన్టీ రామారావుతో తనకున్న సాన్నిహిత్యంకారణంగా దశంధ కాలువ ఆయకట్టు విస్తీర్ణాన్ని పెంచి 24 గంటల పాటు 365 రోజులు కాలువకు నీళ్ళొచ్చేలా యరపతినేని లక్ష్మయ్య కృషి చేశారు. అలాగే బుగ్గవాగు రిజర్వాయర్‌కు పొలాలను సేకరించడంలో తన తండ్రి తిరుమలయ్యతో కలిసి రైతులను ఒప్పించడంలోనూ లక్ష్మయ్య పాత్ర ఉంది. పల్నాడు ప్రాంతంలోని గుండె జబ్బుతో బాధపడుతున్న వేలాది మందిని లక్ష్మయ్య హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్పించి ఆపరేషన్లు చేయించి ప్రాణాలు కాపాడారు. అందుకే ఇప్పటికీ పల్నాడు ప్రాంత ప్రజలు ఆయనను స్మరించుకుంటూ ఉంటారు. యరపతినేని లక్ష్మయ్య స్వగ్రామం అయిన మంచికల్లులో గ్రామస్థులు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు., జూలకంటి బ్రహ్మానందరెడ్డిలతో పాటు కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కే.శ్రీనివాసరావు, ఇతర ప్రజాప్రతిధులు, కూటమి నేతలు అధిక సంఖ్యలో హాజరు కానున్నారు.



ధూళ్ళిపాళ్ల లయోల ఇంజనీరింగ్ కళాశాలలో బేస్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తదితరులు


బేస్‌బాల్ పోటీలు ప్రారంభం

సత్తెనపల్లి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ధూళ్ళిపాళ్ళ లయోల ఇంజనీరింగ్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ అండర్-19 బేస్ బాల్ పోటీలను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, జిల్లా బేస్ బాల్ అసోసియే షన్ అధ్యక్షుడు తాళ్ళ వెంక టేష్ యాదవ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలకు ప్రాధా న్యత ఇస్తుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించా లన్నారు. 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు.


కోటయ్య స్వామి ఆలయం

రేపు కోటప్పకొండలో ఆరుద్రోత్సవం

● విశేష అభిషేకాలకు విస్తృత ఏర్పాట్లు
● తరలిరానున్న మేధాదక్షిణామూర్తి మాలధారణ స్వాములు



శ్రీ మేధా దక్షిణామూర్తి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామికి ఆరుద్రోత్సవం 16న సోమవారం వైభవంగా జరగనున్నది. ఇందుకోసం దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నది. కోటయ్యస్వామికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు. వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో మేధా దక్షిణామూర్తి మాలధారణ స్వాములు ఆరుద్రోత్సవానికి తరలిరానున్నారు. అయ్యప్ప స్వామి తరహాలో కోటప్పకొండ శ్రీమేధాదక్షిణామూర్తి మండల దీక్ష భక్తులు చేపడతారు. ఆరుద్రోత్సవానికి హాజరై స్వాములు ప్రత్యేక అభిషేకాలు చేస్తారు. అర్ధరాత్రి 12 గంటలకు భక్తులు జ్యోతి దర్శనం చేసుకుంటారు. అనంతరం శ్రీత్రికోటేశ్వరస్వామికి మహన్యాసపూర్వక మహారుద్రాభిషేకం నిర్వహిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. శ్రీత్రికోటేశ్వరస్వామిని మేధా దక్షిణామూర్తిగా కూడా భక్తులు కొలుస్తారు. కోటి వరాల దీక్ష కోటప్పకొండ దీక్ష అనే సంకల్పంతో మేధా దక్షిణామూర్తి మాలను భక్తులు ధరిస్తారు. కోటప్పకొండలో 1981 నుంచి కోటయ్య స్వామి మాలధారణ ప్రారంభమైంది. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు కోటప్పమాలను ధరించి 41 రోజులు మండల దీక్షను భక్తిశ్రద్ధలతో చేపడతారు. అర్ధ మండల దీక్షతో పాటు 11 రోజుల మాలధారణ కూడా స్వాములు చేపడతారు. కోటి వేల్పుల అండ కోటప్పకొండ అని భక్తులు విశ్వసిస్తారు. అయ్యప్ప స్వాముల వలె కోటయ్య మాల ధరించిన స్వాములు ఇరుముడితో కోటప్పకొండ చేరుకుంటారు. ఆరుద్రోత్సవం సందర్భంగా కోటయ్య స్వామికి స్వాములు ఇరుముడి సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తారు. ఇరుముడిని స్వాములు తలపై ధరించి నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల నుంచి కొందరు పాదయాత్రగా కోటప్పకొండ చేరుకుంటారు. కోటప్పకొండలో జరగనున్న ఆరుద్రోత్సవం సందర్భంగా లింగంగుంట్ల శివాలయంలో మాలధారణ స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

కోటప్పకొండలో ఆరుద్రోత్సవం సందర్భంగా జరిగే అభిషేకాలకు విశిష్టత నెలకొంది. స్వామికి వివిధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. జ్యోతి దర్శనం అనంతరం త్రికోటేశ్వరస్వామికి మహన్యాస పూర్వక మహారుద్రాభిషేకం జరగనుంది. వీభూది, గంధం, కుంకుమ, పంచదార, వివిధ రకాల ఫలాలు, ఎండు ఫలాలు, ఆవు నెయ్యి, పెరుగు, తేనె, పాలు తదితర ద్రవ్యాలతో స్వామికి ఘనంగా అభిషేకాలు నిర్వహిస్తారు. తదుపరి స్వామికి అన్నాభిషేకం చేస్తారు. అర్ధరాత్రి నుంచి తెల్లవార్లు ఆలయంలో మహన్యాస పూర్వక మహా రుద్రాభిషేకాలు ఘనంగా జరగనున్నాయి. అభిషేకాల అనంతరం స్వాములు మాలాధారణలు విరమిస్తారు. మంగళవారం ఉదయం యాగశాలలో లక్ష్మీగణపతి, రుద్రహోమాలు నిర్వహిస్తారు. మేధాదక్షణామూర్తి స్వాములకు ప్రసాదం, భోజన సౌకర్యాలు ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో ఏర్పాటు చేయనున్నారు. ఆరుద్రోత్సవం ఏర్పాట్లను ఈవో డీ చంద్రశేఖరరావు పర్యవేక్షిస్తున్నారు.

ఆరుద్రోత్సవ అభిషేకాలను పురస్కరించుకుని మంగళవారం ఉదయం స్వామికి అభిషేకాలు జరగవని ఈవో తెలిపారు.


శ్రీ త్రికోటేశ్వర స్వామి మూల విరాట్

అనుసంధాన రహదారి మార్గాలను డ్రోన్ సాయంతో పరిశీలిస్తున్న మంత్రి నారాయణ



అమరావతి నుంచి హైవేకి రోడ్ల అనుసంధానం

మంత్రి పీ నారాయణ

మంగళగిరి సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతంలోని సీడ్ క్యాపిటల్ నుంచి జాతీయ రహదారికి అనుసంధానం చేస్తూ రోడ్లను నిర్మించనున్నట్టు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పీ నారాయణ తెలిపారు. రాజధాని ప్రాంతంలో శనివారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. మంగళగిరి వద్ద 16వ జాతీయ రహదారికి అనుసంధానం చేసే ఈ-11, ఈ-13, ఈ-15 రోడ్లు నిర్మించే ప్రాంతాలు, పశ్చిమ బైపాస్ నిర్మాణ పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో రాజధాని నిర్మించాలని సీఎం చంద్రబాబు పూనుకుంటే రైతులు కేవలం 58 రోజుల్లోనే స్వచ్ఛందంగా 34 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తుచేశారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట మూడు ముక్కలాట ఆడి అమరావతిని నిర్వీర్యం చేసిందని వివర్శించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతి నిర్మాణానికి గత ప్రభుత్వం రద్దు చేసిన జీవోలను పునరుద్ధరించి, అన్ని ఇబ్బందులను అధిగమించి రాజధాని నిర్మాణ పనులను వేగవంతం చేసిందని చెప్పారు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ, హడ్కో వంటి సంస్థలు రాజధాని అమరావతి నిర్మాణానికి రుణ సహకారం అందిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే రూ.22వేల కోట్ల విలువైన పనులకు ఆమోదం లభించిందని, తదుపరి సీఆర్డీఏ సమావేశంలో మరో రూ.20 వేల కోట్ల పనులకు అథారిటీ నుంచి ఆమోదం తీసుకుంటామని వివరించారు. అమరావతి క్యాపిటల్ సిటీ 217 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి వుందని, ఇందులో తూర్పు నుంచి పడమర వరకు 16 రోడ్లు వుండగా, ఉత్తరం నుంచి దక్షిణం వరకు 18 రోడ్లు వున్నాయని తెలిపారు. ఈ రోడ్లను జాతీయ రహదారితో అనుసంధానం చేయాల్సి వుందన్నారు. తొలి దశలో ఈ-11, ఈ-13, ఈ-15 రోడ్లను అనుసంధానం చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ-11లో 39 ఎకరాలు, ఈ-13లో 21 ఎకరాలు అటవీ భూమి వున్నట్టు గుర్తించామన్నారు. ఈ-13లో 23 ఇళ్లు, ఈ-11లో 85 ఇళ్లు, ఈ-15లో 65 ఇళ్లు వున్నట్టు గుర్తించామని, వాటిలో ఎక్కువ శాతం ప్రభుత్వ భూముల్లో వున్నట్టుగా తమ దృష్టికి వచ్చిందని వెల్లడించారు. ఈ-11 రహదారి ఎయిమ్స్ సర్వీస్ రోడ్డు వద్ద ఆర్ అండ్ బీ రహదారికి కలుస్తుందని, ఈ-13 రహదారి డీజీపీ కార్యాలయం పక్కగా కలుస్తుందని వివరించారు. ఆరు లేన్లుగా నిర్మించబోయే ఈ రహదార్లలో 80 నుంచి వంద కిలోమీటర్ల మేర వేగంతో వాహనాలు వెళ్లే అవకాశం వుంటుందన్నారు. అతి తక్కువ భూసేకరణ, నష్ట నివారణ జరిగేలా ఈ రహదార్ల నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. దీనికి సంబంధించి లీ కన్సల్టెన్సీకి డీపీఆర్ రూపకల్పన పనులను అప్పగించామని, వారు 90 శాతం అధ్యయనం పూర్తి చేశారని, మరో పదిరోజుల్లో పూర్తి నివేదిక వస్తుందని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.


మ్యాపును పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న మంత్రి నారాయణ

వెంకటపాలెం వేంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం దేవస్థానంలో రైతులు, మహిళలతో జ్యోతిర్మయి



అమరావతి రైతులపై అక్రమ కేసులు ఎత్తివేయటం శుభపరిణామం

● అన్నం పెట్టే రైతు భగవంతుడితో సమానం
● వేంకటేశ్వరుడే అమరావతిలో ఉన్నాడు.. అభివృద్ధి పనులు ఆగవు
● సంగీత విధ్వాంసురాలు జ్యోతిర్మయి కొండవీటి

తుళ్లూరు, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి) అమరావతి రైతులపై పెట్టిన అక్రమ కేసులు కూటమి ప్రభుత్వం ఎత్తివేయటం శుభపరిణామమని ప్రముఖ సంగీత విధ్వాంసురాలు కొండవీటి జ్యోతిర్మయి అన్నారు. శనివారం రైతులు, మహిళలతో కలసి వెంకటపాలెం టీటీడీ వేంకటేశ్వరస్వామిని ఆమె దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ, అన్నం పెట్టే రైతు భగవంతునితో సమానమన్నారు. అటువంటి రైతుపై అక్రమ కేసులు గత వైసీపీ ప్రభుత్వం పెట్టటం దారుణమైన అంశమన్నారు. ముఖ్యంగా మహిళల మీద పెట్టడం దుర్మార్గమన్నారు. ఉద్యమ సమయంలో రైతుల పరామర్శ, ధైర్యం చెప్పటం కోసం పలుమార్లు అమరావతిలో పర్యటించానని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావటంతో రైతులు గుండెల మీద చేయివేసుకొని హాయిగా నిద్రపోవచ్చన్నారు. మొదట రాష్ట్ర రాజధాని అమరావతే అని చెప్పిన జగన్‌రెడ్డి అధికారం చేపట్టాక మూడు రాజధానులని మాట తప్పటం రైతులను మోసం చేయటమేనన్నారు. భగవంతుడు రైతు రూపంలో ఉన్నాడని వారికి హాని చేయటం అంటే దేవుడిని మోసగించటమేనన్నారు. అందుకే ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఎంచుకున్నారన్నారు. అమరావతి అభివృద్ధి శరవేగంగా జరగాలని వేంకటేశ్వరుడిని కోరుకున్నట్టు చెప్పారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచారం వారు తోడ్పాటును అందిస్తే రాష్ట్రం మొత్తం హిందూ మతాన్ని.. ధర్మాన్ని ప్రచారం చేయటం కోసం చాలామంది ముందుకొస్తారన్నారు. ఆ దిశగా టీటీడీ బోర్డు చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. అన్యమతం వారికి హైందవ ధర్మం పట్ల, వేంకటేశ్వరస్వామి పట్ల ఆసక్తి ఉండదని, అటువంటి వారిని టీటీడీ నుంచి తొలగించి వేరే విధులు కేటాయించటమే మేలని జ్యోతిర్మయి పేర్కొన్నారు. ఏ హిందూ దేవాలయాల్లోనైనా అన్యమతస్థులు విధులలో ఉండటం మంచి పరిణామం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. భగవంతుని మీద, హిందూ ధర్మం మీద నమ్మకం ఉన్న వారే ఆలయాల్లో ఉద్యోగ బాధ్యతల్లో ఉండాలనేది ప్రజలందరి కోరికన్నారు. కూటమి ప్రభుత్వం ఆ విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కోరుతున్నానని జ్యోతిర్మయి పేర్కొన్నారు. అమరావతి రైతులపై పెట్టిన అక్రమ కేసులు ప్రభుత్వం ఎత్తివేయటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఈ సందర్భంగా జ్యోతిర్మయి ధన్యవాదాలు తెలిపారు.


ఎయిమ్స్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేయాలి

కలెక్టర్ నాగలక్ష్మి

మంగళగిరి సిటీ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీన మంగళగిరి ఎయిమ్స్ ప్రథమ స్నాతకోత్సవానికి విచ్చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటనలో అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ పిలుపునిచ్చారు. రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ఎయిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాట్లను శనివారం ఆమె వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. రాష్ట్రపతి ఎయిమ్స్‌ను చేరుకునే ప్రవేశ ద్వారం నుంచి బస చేసే ప్రాంతం, ఆడిటోరియం, స్నాతకోత్సవం కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆహూతులందరూ ఉదయం పది గంటల లోపు ఆశీనులయ్యే విధంగా ఎయిమ్స్ అధికారులు చర్యలు తీసుకోవాలని, అగ్నిమాపక వాహనాన్ని అందుబాటులో వుంచాలని, వాహనాల పార్కింగ్, భద్రతా చర్యలు కట్టుదిట్టంగా వుండాలని తెలిపారు. రాష్ట్రపతితోపాటు రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబునాయుడు, ఇతర ప్రముఖులు హాజరు కానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సతీశ్‌కుమార్, ఐఎస్‌డబ్ల్యూ అధికారి ఆరిఫ్ హాఫీజ్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ తేజ, తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహా, ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ శశికాంత్, డీఎంహెచ్‌వో కే.విజయలక్ష్మీ, డీఎస్‌వో పీ.కోమలి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉచితమన్నా.. దోపిడీనే

(5వ పేజీ తరువాయి)

నిర్మాణదారులు పడిన అవస్థలు చూసిన ఇసుక వ్యాపార వస్తువు కాదని, దానిని ఉచితంగానే అందిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. మాటిచ్చినట్లుగానే ఇసుకను ఉచితం చేశారు. పోతకూలీల వంటి నామమాత్రపు ఖర్చులు మినహా అదనంగా వసూలు చేయకుండా తక్కువకు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఇసుక బయటకు తరలించి, లారీలకు నింపినందుకు అయ్యే ఖర్చులు మాత్రం తీసుకోవాలని, ఎక్కడికక్కడ చార్జీలు నిర్ణయించారు. గతంలో ఇసుక తవ్వకాలకు జీఎస్టీ, సీఎస్టీ, సీనరేజ్ వంటి పన్నుల భారం ఇసుకపై ఉండేది. ఆ కొద్ది మొత్తం కూడా సామాన్యులకు భారం కాకూడదని కూటమి ప్రభుత్వం పన్నులు ఎత్తేసింది. కేవలం నది నుంచి ఒడ్డుకు కూలీలతో పోయించి బయటకు తీసుకొచ్చి, లారీలకు లోడ్ చేసినందుకు టన్నుకు నామమాత్రపు మొత్తాన్ని తీసుకునేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. క్షేత్రస్థాయిలో ఇసుక విషయంలో ప్రభుత్వ ఆదేశాలు అమలు కావడంలేదు. పైగా ఎక్కడికక్కడ అధికారులు నిర్ణయించిన రవాణా చార్జీలకు మించి కొన్ని రెట్లు అదనంగా వసూలు చేస్తుండడం అక్రమార్కుల దోపిడీకి నిదర్శనం. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని కూడా కాంట్రాక్టర్లే దోచేస్తున్నారు. దీంతో సామాన్యుడికి ఒరిగేది తక్కువే అయినా, ఆదాయం విషయంలోనూ ప్రభుత్వానికి నష్టమే జరుగుతోంది. సముద్ర తీరంలోని బాపట్ల, చీరాల ప్రాంతాల్లోని పొలాల్లో ఇసుక తవ్వి అమ్మేస్తున్నారు. దీనికి సీనరేజ్ కానీ, పన్నులు కానీ ఏమీ లేవు. అనుమతులు అసలే లేవు. అయినా తవ్వకాలు మాత్రం పగలు, రాత్రి తేడా లేకుండా యథేచ్ఛగా సాగుతున్నాయి. తాజాగా జరిగిన కలెక్టర్ల సదస్సులోనూ ఇసుక విషయంలో ఖచ్చితంగా వ్యవహరించాలని, సామాన్యుడికి తక్కువ రేటుకు ఇసుక అందాలని, దీనికి అందరి సహకారం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. అయినా క్షేత్రస్థాయిలో మార్పులేదు.

ప్రభుత్వం మారినా.. తగ్గేదేలేదు

రాజధాని అమరావతి గ్రామాల్లో ఇసుక మఫియా చెలరేగిపోతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో కృష్ణానది నుంచి ఏవిధంగా ఇసుకను తరలించుకుపోయారో.. అంతకు ఏమాత్రం తగ్గకుండా ఇప్పుడు కూడా తరలించుకుపోతున్నారు. మాజీ ఎంపీ నందిగం సురేశ్ స్వగ్రామమైన ఉద్దండరాయునిపాలెం కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఉద్దండరాయుడిపాలెంలో ప్రధాని మోదీ అమరావతికి శంకుస్థాపన చేసిన ప్రాంతానికి కూత వేటు దూరంలో కూటమి ప్రభుత్వ పాలనలో ఈ దందా జరుగుతుండడం విశేషం. గతంలో అడ్డుకున్న స్థానికులపై అధికారాన్ని ఉపయోగించుకుని ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి బెదిరించి అక్రమాలకు పాల్పడిన నందిగం అనుచరులు ఇప్పటికీ అదే పందాలో దందా చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. మాజీ ఎంపీ జైలుపాలైనా ఆయన అనుచరులు తగ్గడంలేదు. అందుబాటులో ఉన్న ఇసుకను స్థానికులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా తరలించుకుపోవచ్చన్న అవకాశాన్ని ఆసరా చేసుకుని పట్టపగలే దర్జాగా ఇసుకను తరలించుకుపోతున్నారు. నది నుంచి ఇసుకను ట్రాక్టర్లతో తరలించి, సమీపంలో డంప్ చేసుకుని రాత్రిళ్లు లారీల్లోకి లోడింగ్ చేసి తరలిస్తున్నారు. అధికారులు కూడా అటువైపు చూడకపోవడం విశేషం.

కేసులున్నా.. ఆగని అక్రమాలు

వైసీపీ హయాంలోనే ఇక్కడి ఇసుక తవ్వకాలపై గ్రీన్‌ట్రిబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. సుప్రీంకోర్టు కూడా తవ్వకాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం వచ్చినా.. ఆ సంస్థ అక్రమాలు ఆగలేదు. పైగా గ్రీన్‌ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నా సదరు సంస్థ ఇసుక తవ్వకాలను ఆపలేదంలేదని తెలుస్తోంది. ఎన్నికలు ముగిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కృష్ణా నదిని పూర్తిగా తవ్వేశారు. ఈ సంస్థ వెనుక వైసీపీ ముఖ్య నేతలు ఉండడంతో గ్రీన్‌ట్రిబ్యునల్ ఆశ్రయించిన వ్యక్తిని కూడా అక్రమ కేసుల్లో ఇరికించి ఇబ్బందులు పెట్టారన్న విమర్శలున్నాయి. ఇలాంటి సంస్థపై కేసులు నమోదైన తర్వాత ఏమి చర్యలు తీసుకున్నారన్నది బహిర్గతం కావాల్సి ఉంది.


టీటీడీ బోర్డు సభ్యురాలు జానకీ దేవికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న టీటీడీ బోర్డు సభ్యురాలు

తుళ్లూరు, డిసెంబరు 14: (ఆంధ్రజ్యోత) మండల పరిధిలోని అనంతవరం వేంకటేశ్వర స్వామిని శనివారం టీటీడీ బోర్డు సభ్యురాలు జానకీ దేవీ దర్శించుకున్నారు. వేద పండితులు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మెట్ల మార్గం పనులు త్వరగా పూర్తి చేయాలని టీటీడీ సిబ్బందికి సూచించారు. అన్నదాన భవనం, కల్యాణ కట్టకు షెడ్లు నిర్మించాలని రైతులు, గ్రామస్తులు జానకీ దేవీకి వినతి పత్రం సమర్పించారు. అభివృద్ధి పనుల గురించి ఛైర్మన్‌కు తెలియజేస్తామని ఆమె రైతులకు తెలిపారు. పలువురు బీజేపీ నేతలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రాజధాని రైతుల కేసులు పరిష్కారం


కోర్టుకు విచ్చేసిన రాజధాని రైతులు

మంగళగిరి, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో రాజధాని రైతులపై పెట్టిన కేసులలో 30 కేసులు పరిష్కారమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో రాజధాని రైతులపై అనేక కేసులు నమోదు చేయడంతో రాజధాని మహిళా రైతులు సైతం నేటికీ కోర్టుల చుట్టూ తిరగాల్సివస్తోంది. ప్రభుత్వం మారిన తరువాత కేసులు ఎత్తివేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేశ్ ఎన్నికల సమయంలోనే హామీ ఇచ్చారు. తదనుగుణంగా శనివారం జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో 30 కేసులు పరిష్కారమయ్యాయి. కోర్టు ప్రాంగణం రాజధాని రైతులు, కక్షిదారులతో కిటకిటలాడింది. ఈ కేసుల పరిష్కారంలో లోకేశ్ చూపిన చొరవ పట్ల రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి జాతీయస్థాయి సబ్‌జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలు

● ఏపీ బాలురు, బాలికల జట్లు ఎంపిక

ద్రాక్షారామం, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నేటి నుంచి జరగనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్స్ బాస్కెట్ పోటీలకు ఏపీ బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో ఈనెల 1 నుంచి 14 వరకు సబ్ జూనియర్ జాతీయ బాస్కెట్‌బాల్ కోచింగ్ క్యాంపు శాప్ పర్యవేక్షణలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి రామచంద్రపురం బాస్కెట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గతంలో నిర్వహించిన పోటీల నుంచి ఎంపిక చేసిన 18 మంది క్రీడాకారుల నుంచి సబ్ జూనియర్స్ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల ఏపీ జట్టును ఎంపిక చేసినట్టు శాప్ కోచ్ ఎస్.సంతోష్‌కుమార్ తెలిపారు. అదే విధంగా పశ్చిమ గోదావరి జిల్లా ఉల్లంపర్రు, మాంటిస్సోరి పాఠశాలలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ ఆధ్వర్యంలో పశ్చిమ గోదావరి బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 14 వరకు బాలికల జాతీయ బాస్కెట్‌బాల్ కోచింగ్ నిర్వహించినట్టు శాప్ కోచ్ పి.జగదీష్ తెలిపారు. జాతీయస్థాయి బాస్కెట్ బాల్ సబ్ జూనియర్ బాలికల పోటీలో పాల్గొనే ఏపీ బాలికల జట్టును ఎంపిక చేసినట్టు తెలిపారు. శిక్షణ పర్యవేక్షించిన బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఇన్ ఏపీ రాష్ట్ర కార్యదర్శి గన్నమని చక్రవర్తి ఎంపికైన బాలురు, బాలికల జట్లు, క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

బాలుర జట్టు: ఎస్.శ్రీసాయి చరణ్, వై.సుశ్రిత్, కె.ప్రణీత్, టి.గౌతమ్(తూర్పుగోదావరి), ఇ.చార్లెస్ వెస్లీ(పశ్చిమగోదావరి), జి.జగదీష్, ఎ.మనోఅభిరామ్ (కృష్ణాజిల్లా), పి.జీవన్, బి.ఉజ్వల ఈశ్వర్‌సాయి, ఎం.సంతోష్(అనంతపురం), బి.ఎస్.కార్తికేయ(విశాఖ), బి.సత్యేంద్ర(గుంటూరు) ఎంపికయ్యారు. స్టాండ్ బై క్రీడాకారులుగా వి.కిరణ్(తూర్పుగోదావరి), వి.వహివాట్సన్(విశాఖ), వి.హర్షిత్(గుంటూరు) ఎంపిక చేశారు.

బాలికల జట్టు: సీహెచ్ ఐశ్వర్యాంబిక, బి.సాలిని రత్న మాధురి, సీహెచ్ భువనేశ్వరి, డి.హాసిని(తూర్పుగోదావరిజిల్లా), బి.కుసుమ, బి.వర్షిణి, ఆర్.వర్షిణి(కృష్ణా), కె.ఆముక్త, వై.హిమవర్షిణి(విశాఖ), టి.అంజలి, ఎస్.జాస్మిన్(చిత్తూరు), ఏవీఎల్ అక్షయ(గుంటూరు) ఎంపిక చేశారు. స్టాండ్ బై క్రీడాకారిణిలుగా పి.శాంతి, డి.శంకరి(తూర్పుగోదావరి), ఎస్.ఎస్.ఎస్.ఎస్. ఆకర్షలను ఎంపిక చేసినట్టు కోచ్ పి.జగదీష్ తెలిపారు.



సబ్ జూనియర్ జాతీయస్థాయి ఏపీ బాలికల జట్టు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

మున్సిపల్ కార్యాలయంలో రేపు ప్రజాదర్బార్

వినుకొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపల్ పరిధిలోని ప్రజాసమస్యలపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 16న ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలియజేయవల్సిందిగా ఆయన కోరారు.

జాతీయ లోక్ అదాలత్‌లో
317 కేసుల పరిష్కారం

నరసరావుపేట లీగల్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు స్థానిక మండల న్యాయ సేవ అధికార సంస్థ కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని కోర్టు ఆవరణలో జాతీయలోక్ నిర్వహించినట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయాధికారి ఎన్ సత్యశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, క్రిమినల్, చెక్ బౌన్స్, మోటార్ వాహన ప్రమాదం కేసులు, ముందస్తు వ్యాజ్యం, మనోవర్తి కేసులు, డీవీసీలు మొత్తం 317 కేసులు పరిష్కరించినట్టు ఆమె తెలిపారు. పరిష్కరించిన కేసుల్లో కక్షిదారులకు 3 కోట్ల 40 లక్షల పంతొమ్మిది వేల రూ.996ల మేరకు కక్షిదారులకు పరిహారం చేకూరినట్లు తెలిపారు. అదాలత్‌లో మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి టీ ప్రవళిక న్యాయవాదులు కట్టు నారపరెడ్డి, హరీష్, శ్రీరాములు, సురేష్, పోలీసు అధికారులు కక్షిదారులు పాల్గొన్నారు.

27 ఎక్సైజ్ కేసుల పరిష్కారం

చిలకలూరిపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జడ్జి నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో శనివారం జరిగిన మెగా లోక్‌అదాలత్ కేసుల్లో మొత్తం 27 ఎక్సైజ్ కేసులు పరిష్కరించారు. ఈ అదాలత్‌లో ఎక్సైజ్ సీఐ వినయ్‌కుమార్, ఎస్ఐ సీహెచ్ దయాకర్ పాల్గొన్నారు.

18న అఖిలపక్ష సమావేశం

నరసరావుపేట టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా అఖిలపక్ష రైతు, కార్మిక, ప్రజాసంఘాల సమావేశం 18న ఉదయం 10గంటలకు నరసరావుపేటలో జరుగుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు తెలిపారు. శనివారం సీపీఐ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాసా రాంబాబు మాట్లాడుతూ కృష్ణా, గోదావరి, పెన్నా నదుల అనుసంధానం, హరిశ్చంద్రాపురం నుంచి నకరికల్లు వద్ద ఎత్తి పోతల పథకం పనులు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రారం భించాలని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సాగునీరు అందడమే కాక, ఆ ప్రాంతాలన్నీ సస్యశ్యామలం అవుతాయన్నారు. ప్రజల కోరిక మేరకు ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆయా అంశాలు చర్చించే సమావేశానికి రైతు, కార్మిక, అన్ని ప్రజాసంఘాలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఏరియా కార్యదర్శి సీహెచ్ సత్యనారాయణ రాజు, ఉప్పలపాటి రంగయ్య, ఎస్‌కే చిన్న జాన్‌సైదా తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళాలు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం కోట బజారు పులుపుల వారి వీధిలో ఉన్న శ్రీవీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ నిర్మాణానికి పలువురు శనివారం విరాళాలు అందజేశారు. మల్లెల జగన్మోహన్‌రావు, శివకుమారి దంపతులు రూ.51116లు కమిటీకి అందజేశారు. సాతులూరి వెంకటరామ మాధవ, లలిత దంపతులు రూ.25116లు, చిలకల మహేష్‌కుమార్, విజయలక్ష్మి దంపతులు రూ.25116లు అందజేశారు. దాతలకు దేవస్థాన కమిటీ ధన్యవాదాలు తెలియజేశారు.

ఎన్ఎస్‌పీ కాలనీలో
పార్కు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం

వినుకొండటౌన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపల్ పరిధిలోని ఎన్ఎస్‌పీ కాలనీ గ్రౌండ్‌కు మంచిరోజులు రానున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సుమారు 22 ఎకరాల విస్తీర్ణం గల భూమిని అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఒప్పించి మున్సిపాల్టికి కేటాయించారు. వైసీపీ ప్రభు త్వం అధికారంలోకి రావడంతో కాలనీలోని ఇంటి నిర్మాణాలను తొలగించి భూమిని నిరుపయోగంగా మార్చారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఎన్ఎస్‌పీ స్థలం అభివృద్ధి కార్యక్రమాలకు తొలి అడుగు వేయనున్నారు. పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సుమారు ఎకరం విస్తీర్ణంలో నూతనంగా పార్కును ఏర్పాటుచేయనున్నారు. ఇప్పటికే మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ పార్కుకు అవసరమైన స్థలం కొలతలు రోడ్డు మార్గం తదితర అంశా లను ఉన్నతాధికారులకు పంపారు. త్వరలో కాలనీ ఆవరణలో పట్టణ అభి వృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నూతన పార్కు ఏర్పాటుతో తొలి అడుగు వేయనున్నారు.

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా
కందుల రమణ

చిలకలూరిపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కందుల రమణ గౌడ్ శనివారం రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో శనివారం పదవీ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రమణకు ప్రత్తిపాటి పుల్లారావు, నియోజకవర్గ టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

భారీ వాహనాలకు
అనుమతి లేదు

గురజాలటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న పాతపాటేశ్వరమ్మ తిరునాళ్లను పురస్కరించుకొని ఆది, సోమవారాలు పట్టణంలోకి భారీ వాహనాలను అనుమతించడం లేదని సీఐ ఆవుల భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. తిరునాళ్ల కార్యక్రమాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పట్ట ణంలోకి భారీ వాహనాలను అనుమతించడం లేదన్నారు.

విద్యార్థులు అసూయ, ప్రతీకారం వదిలేయాలి

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు
- శివశక్తి ఫౌండేషన్ ద్వారా స్కాలర్‌షిప్‌ల పంపిణీ



విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జీవితంలో ఎదగాలంటే అసూయ, ప్రతీకారం వదిలేయాలని, అబ్దుల్‌కలాం, అంబేద్కర్ లాంటి గొప్ప వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. నరసరావుపేట రోడ్డులోని గంగినేని ఫంక్షన్‌హాల్ నందు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ స్ఫూర్తి కర్త కేవీ ప్రదీప్ హాజరయ్యా రు. అనంతరం మోటివేషన్ స్పీకర్స్ రావులపల్లి శ్రీనివాసరావు, మిలక గోవర్ధను, గజవల్లి వెంకటసుబ్బయ్యలు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ చదువుకునే సమయంలో తనకెంతో చేదోడువాదోడుగా ఉన్న తన స్నేహితులను తలుచుకుంటూ ఉద్వేగానికి గురయ్యారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించి ట్యాక్స్ కట్టే స్థాయికి ఎదిగి మీ ముందు నిలుచున్నానంటే ఇది ప్రజలు ఇచ్చిన అవకాశమన్నారు. జన్మభూమి రుణం తీర్చుకోవడమే నా ముందు ఉన్న ప్రధాన లక్ష్యమన్నారు. అనంతరం పట్టణంలోని ప్రైవేటు కళాశాలల డైరెక్టర్ యడవల్లి శ్రీవల్లిపావని, కిషోర్, బాస్కరరెడ్డి బొడ్డపాటి లింగారావు, కేవీ ప్రదిప్‌తోపాటు రావులపల్లి పుల్లారావులను సన్మానించారు. అనంతరం రా వులపల్లి పుల్లారావు రచించిన 'గెలుద్దాం పదా' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో శివశక్తి ఫౌండేషన్ మేనేజర్ జీవీ రమణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సొంత నేతలే ముఖం చాటేశారు

వినుకొండటౌన్, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జగన్‌రెడ్డి కార్యక్రమాలకు సొంత నేతలే మొఖం చాటేశారు. ఐదేళ్లు చేసిన పాపానికి ఫలితం అనుభవిస్తున్నాడని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. బలంలేక ఎమ్మెల్సీ సాగునీటి ఎన్నికల నుంచి జగన్మోహన్‌రెడ్డి తప్పు కున్నాడని.. ఆందోళనకు పిలుపునిచ్చిన జగనే జనంలోకి వెళ్లకపోవడం విడ్డూరంగా ఉందని, జగన్‌రెడ్డి పార్టీని బంద్ చేసుకోవడం ఉత్తమమని శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి వైసీపీ మొదలుపెట్టిన ఆందోళనలు పట్టించుకున్న నాధుడే లేడని రాష్ట్రంలో జగన్ చేసిన అరాచకాలు, అక్రమాలు, దుర్మార్గాలే ఇందుకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలుగా అరాచకాలు సృష్టించి రాష్ట్రా న్ని అప్పులుపాలుచేశారని, చేతగాని తనాన్ని యాత్రలతో కవరు చేద్దామనుకున్న జగన్ అక్కడ బోర్లపడ్డారనారు. అధికారం లేకపోతే బతకలేని జగన్ ప్రజలకు మొహం చూపించలేని వ్యక్తి రాజకీయాలకు పనికిరాకుండ పోయాడన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీని నడిపించడం కంటే జగన్‌రెడ్డిపార్టీని మూసుకోవడం ఉత్తమమని జీవీ సూచించారు.

నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవం

- ఎంపికైనవారికి ధ్రువీకరణ పత్రాలు అందజేసిన అధికారులు
- అభినందించిన ప్రజాప్రతినిధులు



కొండ్రముట్ల- పాపిశెట్టి శ్రీని వాసరావుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి చుట్టూరి వెంకటరవి



కొచ్చెర్ల - నెల్లూరి శాంతారావుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి రామతులసీ, తహసీల్దారు నళిని

వినుకొండటౌన్, డి సెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో నియోజకవర్గంలో మొత్తం 24 చెరువులకు ఎన్నికలు జరగ్గా వినుకొండ మండలంలోని ఉన్న 7 చెరువులకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను శనివారం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వివరాలను పరిశీలిస్తే చెట్టుపల్లి గ్రామ చెరువు అధ్యక్షుడిగా వేల్పూరు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బోయపాటి రోశయ్య, గోకనకొండ ఆకులవారి చెరువుకు అధ్యక్షుడిగా వల్లెం వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా కొంటి పుల్లారావు, పెదకంచర్ల.. రామినేని కోటేశ్వరరావు, పరిటాల వెంకటేశ్వర్లు, దొండపాడు.. మద్దుకూరి లింగయ్య, తెల్లమేకల నాగరాజు, నడిగడ్డ.. మేకల వలయరాజు, పాలడుగు.. సుబ్బారావు, కొప్పుకొండ బుడంచిన వెంకటేశ్వర్లు, నూలి వెంకటేశ్వర్లు, పిట్టంబండ కర్రి నాగేశ్వరరావు, గంగుల కిషోర్‌లు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

వినుకొండ మండలంలో జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల్లో వినుకొండ, చీకటీగలపాలెం డీసీలకు టీసీలను ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయి. కొచ్చెర్ల సాగునీటి సంఘం అధ్యక్షుడిగా నెల్లూరి శాంతారావు, ఉపాధ్యక్షుడిగా నిశంకర రామారావు, పెరుమాళ్లపల్లి అధ్యక్షుడిగా జిల్లెలమూడి ఆంజ నేయులు, ఉపాధ్యక్షుడిగా దావులూరి వెంకయ్యబాబు, చిట్టాపురం - మెట్టెల వెంకటేశ్వర్లు, కామని రామయ్య, వినుకొండ-2 చప్పిడి రామారావు, మక్కెన రామారావు, వినుకొండ-1 మాలపాటి వెంకటసుబ్బారెడ్డి, కంచర్ల ఏడుకొండలు, కొండ్రముట్ల- 2 పాపిశెట్టి శ్రీనివాసరావు, కందుల లక్ష్మిరెడ్డి, కొత్తలూరు వల్లూరి అయ్యన్నబాబు, చెరుకూరి సుబ్బారావు, పిచికలపాలెం పొంతూరి హనుమంతరావు, దుగ్గెంపూడి రామాంజనేయులు, కొండ్రముట్ల- గడిపూడి వేణుగోపాలరావు, సూర పెదకంచుల రెడ్డి, కొండ్రముట్ల-3 దావులూరి కోటేశ్వరరావు, బోడెపూడి శ్రీనివాసరావులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. చీకటీగలపాలెం డీసీ పరిధిలోని ఫలితాలు అధికారులు వెలువరించాల్సి ఉంది.

గంటవారిపాలెం(శావల్యాపురం): మండలంలోని



కారుమంచిలో ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేస్తున్న అధికారులు, నాయకులు

గంటవారిపాలెం సెక్టార్ పరిధిలో డిస్ట్రిబ్యూటర్ కమిటీ నెంబర్- 25లోని 11సాగునీటి సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నికల్లో సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కమిటీ సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గంటవారిపాలెం సెక్టార్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోట్లూరి లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వేల్పూరు సాగునీటి సంఘం (204) అధ్యక్షుడిగా గుత్తా సీతారామయ్య, ఉపాధ్యక్షుడిగా తూమాటి నాగేశ్వరరావు, అలవాల.. గంటా హనుమత్రసాద్, దూళ్ల నాగాంజనేయులు, శానంపూడి-1.. మందలపు వెంకటనారాయణ, ముండ్రు ఆంజనేయులు, పోట్లూరు.. కామినేని సుబ్బారావు, పొందూరి బ్రహ్మయ్య, కనమర్లపూడి.. చెరుకూరి రామాంజనేయులు, మన్నం ఆంజనేయులు, అన్నవరప్పాడు.. కొత్త ఎల్లారెడ్డి, కొత్త రామిరెడ్డి, కామేపల్లి.. గాడిపర్తి కోటేశ్వరరావు, నన్నెబోయిన కొండలు, శానంపూడి-2 - మొద్దుల శ్రీనివాసరావు, ముండ్రు వీరయ్య, కారుమంచి.. పోలూరి సైదులు, మద్దినేని చినవెంకటేశ్వర్లు, ఏనుగుపాలెం-1.. వడ్లమూడి వెంకటకోటయ్య, సోమేపల్లి వెంకటేశ్వర్లు, ఏనుగుపాలెం-2.. మక్కెన ఏడుకొండలు, కొండ్రగుంట్ల రంగారావులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గసభ్యులను ఎన్నికల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు కలసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

బొల్లాపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలో మొత్తం 12 నీటి సంఘాలు ఉండగా మొత్తం కూటమి అభ్యర్థులే ఏకగ్రీవమై విజయ దుందుబి మోగించారు. వెల్లటూరు నీటిసంఘానికి కామిశెట్టి ఏడుకొండలు, పేరూరుపాడుకు గుర్రం నరసింహారావు, బొల్లాపల్లికి గంగనబోయిన నాగయ్య, రేమిడిచర్ల.. ఊరి బిండి కొండలు, రావులాపురం.. అన్నపురెడ్డి వెంకటేశ్వర రెడ్డి,



వెల్లటూరులో అధ్యక్ష, ఉపాధ్యక్షులకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి ఏ అంకారావు

గరికపాడుకు ముక్కపాటి లక్ష్మి, పమిడిపాడు.. పెద్దవరపు కోటయ్య, గుట్లాపల్లి షేక్ శిలారు, పలుకూరు.. పూజల పెద వెంకటయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వెల్లటూరులో ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడిగా కామిశెట్టి ఏడుకొండలు, ఉపాధ్యక్షుడిగా వినుకొండ కాశయ్యలను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెమ్మసాని నాగేశ్వరరావు సన్మానించారు.

నూజెండ్ల (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మూడు



వీఅప్పాపురం అధ్యక్షుడు నక్కా బుల్లీశ్వరరెడ్డికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఏడీఏ బీ రవిబాబు

డీసీల పరిధిలోని 27 సాగునీటి సంఘాలు, నాలుగు మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు శనివారం జరిగాయి. డీసీ 28 ఐనవోలు పరిధిలోని మృత్యుంజాపురం-1 అధ్యక్షుడిగా దేవినేని చిన వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా మేకల రాంబాబులు ఎన్నికయ్యారు. మృత్యుంజాపురం-2.. ఫణిదపు గాలేశ్వరరావు, తిరువీధి వెంకటనారాయణ, చింతలచెరువు - 1.. లేళ్ళ శేషయ్య, చింతలచెరువు రాంబాబులు, చింతలచెరువు -2.. మల్లెల బక్కమ్మ, కొండమీది కోటిలింగం, ఐనవోలు.. రావుల బుజ్జి, చక్ర వీరారెడ్డి, ముక్కెళ్ళ పాడు.. లగడపాటి చినకొండలరావు, సింగంశెట్టి శ్రీనివాసరావు, తంగిరాల.. తూమాటి చినసుబ్బయ్య, మన్నెం ఏడుకొండలు ఎన్నికయ్యారు. త్రిపురాపురం డీసీ 29లో పమిడిపాడు - 1 జెడ్డా వెంకటేశ్వర్లు, నారి చిన్న బసవయ్య, పమిడిపాడు-2.. మన్నం విజయ, మేకల బసవయ్య, నూజెండ్ల - 1.. మేదర మెట్ల శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, ఉప్పలపాడు.. జమ్ముల నరసింహారావు, నంబుల పాపారావు, కంభంపాడు.. గంగినేని రాఘవరావు, గంగినేని చిన వెంకటరావు, త్రిపురాపురం.. తిప్పిరెడ్డి అంజిరెడ్డి, జెక్కిరెడ్డి నాగిరెడ్డి, పుచ్చనూతల ఓబుళాపురం ఏడుకొండలు, తురుమెళ్ళ పెద్ద సుబ్బయ్య, ములకలూరు డీసీ నెంబరు 30 పరిధిలోని వీఅప్పాపురం.. నక్కా బుల్లీశ్వరరెడ్డి, కంచుమాటి తిరుపాలు, నూజెండ్ల - 2.. ఎండ్లూరి వెంకటరావు, రఘుపతి చిన పాపయ్య, తలార్లపల్లికి కుంటా కృష్ణారెడ్డి, కుంటా వెంకటేశ్వర రెడ్డి, ములకలూరుకు ఎర్రబిక్కి వెంకటరావు, బత్తిన రామారావు, పువ్వాడ -1.. కాట్ల సత్యనారాయణ, మాగులూరి శ్రీనివాసరావు, పువ్వాడ - 2.. గోరంట్ల సాంబశివరావు, ఒంగోలు వెంకటేశ్వర్లు, ఈదర బొప్పూడి వీరాంజనేయులు, మక్కెన శ్రీనివాసరావు, జమ్మలమడక.. నిడమానూరి ఖాజారావు, కోనంకి నరేంద్ర, తిమ్మాపురం.. నర్రా శ్రీను, కత్తి నాగేశ్వరరావు, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు నూజెండ్ల.. శ్రీరామినేని సుబ్బారావు, గడ్డిపాటి శ్రీహరి, రాముడుపాలెం ఆకుల చిన రాఘవయ్య, ఐనవోలు.. మేకల పిచ్చయ్య, జెడ్డా అంజయ్య, ముక్కెళ్ళపాడు.. సింగంశెట్టి శ్రీరామమూర్తి, పిల్ల చిన వెంకటరావు అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికల అధికారుల సమక్షంలో టీసీ మెంబర్లు ఎన్నుకున్నారు. వీరికి ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ఈపూరు (ఆంధ్రజ్యోతి): మండలంలో 11 సాగునీటి సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొచ్చెర్ల సాగునీటి సంఘం అధ్యక్షుడిగా నెల్లూరిశాంతారావు, ఉపాధ్యక్షుడిగా నిశ్శంకర రావు రామారావు, కొండ్రముట్ల-1.. గడిపూడివేణుగోపాల్, పెదపెంచలరెడ్డి, కొండ్రముట్ల-2.. పాపిశెట్టి శ్రీనివాసరావు, కందుల లక్ష్మీరెడ్డి, కొండ్రముట్ల-3.. దావులూరి కోటేశ్వరరావు, బోడెపూడి శ్రీనివాసరావు, చిట్టాపురం.. మెట్టెల వెంకటేశ్వర్లు, కామని రామయ్య, కొండాయిపాలెం.. వెంపటి సీతయ్య, గోగుల సుబ్బయ్య, ముప్పాళ్ళ-1.. లింగా ప్రసన్నాంజనేయులు, గోనుగుంట్ల రామయ్య, ముప్పాళ్ళ-2.. పులుకూరి నాగార్జున, మద్దినేని పణీంద్ర, అగ్నిగుండాల.. ఘంటా సాంబయ్య, దూదేకుల హుస్సేన్, బొగ్గరం - వడ్లమూడి వీరయ్య, వడ్లమూడి నాగేశ్వరరావు, ఈపూరు.. కాట్లు హనుమంతురావు, గోవిందులను ఎన్నుకున్నారు. ఎన్నికైనవారికి ధ్రువీకరణ పత్రాలను అధికా రులు, తహసీల్దారు అందజేశారు.

రొంపిచర్ల (ఆంధ్రజ్యోతి): మండలంలో 23 సంతగుడిపాడు, 24 రొంపిచర్ల డిస్ట్రిబ్యూటరీ కమిటీ పరిధిలో 15 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. సంతగుడిపాడు.. లింగా రవికుమార్, అన్నవరం.. ఈదర నాగేశ్వరరావు, మాచవరం.. యాంపాటి కోటిరెడ్డి, సంతగుడిపాడు-2 .. కందుల కోటయ్య, దాసరిపాలెం.. నిడమానూరి శ్రీనివాసరావు, దాసరిపాలెం-2..: మాదినీడి అంజయ్య, గోగులపాడు.. జవ్వాజి నరసింహయ్య, తురుమెళ్ళ.. చిరుమామిళ్ళ మల్లికార్జునరావు, అన్నవరం-2.. వడ్లమూడి రామాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముత్తనపల్లి..గాడిపర్తి ప్రసాదు, కొత్తపల్లి.. గంగూరి శివరాఘవయ్య, విప్పర.. రామిశెట్టి వెంకటేశ్వరరావు, అలవాల.. హనుమత్రసాదు, అన్నవరప్పాడు.. కొత్త యల్లారెడ్డి, గోగులపాడు-2.. పొందూరి అంకమ్మరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమాలను తహసీల్దార్ బండి నిర్మల, రూరల్ సీఐ రామకృష్ణ, ఎన్ఎస్‌పీ డీఈ విజయలక్ష్మీలు పర్యవేక్షిం చారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను టీడీపీ నాయకులు అభినందించారు.

సాగునీటి సంఘం అధ్యక్షుడిగా ఎంపికైన వీరవ



తురుమెళ్ళ అధ్యక్షుడిగా ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న చిరుమామిళ్ళ మల్లికార్జునరావు

ట్నం గ్రామానికి చెందిన చిరుమామిళ్ళ మల్లిఖార్జునరావును గ్రామ టీడీపీ నాయకులు అభినందించారు. చల్లా సుబ్బారావు, మాలెంపాటి కొండలు, వెలగటూరి బ్రహ్మానందం, జాష్టి ప్రసాదు తదితరులున్నారు.

చిలకలూరిపేట (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు సాగునీటి సంఘాలకు ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. యడవల్లి సంఘానికి ముత్యాల వీరాంజనేయులు అధ్యక్షుడిగా, కొత్తపల్లి నాగేశ్వరరావు ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కావూరు-2.. మాలంపాటి నాగేశ్వరరావు, నాగబోతు మస్తాన్‌రావు ఎన్నికయ్యారు. పురుషోత్తంపట్నం.. బైరా సంజీవరావు, మద్దుకూరు శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. కావూరు ఎల్ఐఎస్-2.. మద్దాలి మస్తాన్‌రావు, ఉపాధ్యక్షుడిగా మద్దాలి హరి గోపాలరావు ఎన్నికయ్యారు.

నాదెండ్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అన్ని సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. తుర్లపాడు మేజరు కాలువ పరిధిలో తొమ్మిది సంఘాలు ఉండగా ఎనిమిది సంఘాలకు టీడీపీ మద్దతు దారులు, గణపవరం సంఘానికి జనసేన మద్దతుదారుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సాతులూరు - 1 సాగునీటి సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కామినేని శ్రీకాంత్, పాటిబండ్ల రమేష్‌బాబు, కనపర్రుకు పచ్చవ మోహనరావు, వీరగంధం దుర్గాప్రసాదు, ఎండుగుం పాలెం.. నెల్లూరు రామారావు, షేక్ రసూల్, ఇర్లపాడు.. పసల వెంకట సుబ్బారావు, కోమటినేని సత్యనారాయణ, కావూరు.. మద్దాలి మస్తాన్‌రావు, హరిగోపాలరావు, అప్పాపురం.. మద్దుకూరి కృష్ణమూర్తి, నాయుడు నాగేశ్వరరావు, నాదెండ్ల.. ఆరే రామారావు, ఉమామహేశ్వరరావు, గణపవరం.. తులం రామయ్య, సోమరాజు శ్రీనివాసరావు, సాతులూరు- 2.. గడ్డం శివాజీ, పీ వెంకయ్య, చిరుమామిళ్ళకు బాపతు వెంకటేశ్వరరెడ్డి, నూతక్కి అచ్చయ్య, తూబాడుకు చెన్నుపాటి శ్రీనివాసరావు, పోపూరి మస్తాన్ రావులు ఎన్నికయ్యారు. వీరిని టీడీపీ నాయకులు సత్య నారాయణ, హరిబాబు అభినందించారు.

యడ్లపాడు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవీడు, వంకాయలపాడు మేజర్లకు, జాలాది పీబీసీ కెనాల్ సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నిక జరిగింది. మూడు సంఘాలకు జరిగిన ఎన్నికలు ఏకగ్రీవం కాగా మూడింటిని టీడీపీకి చెందిన వారు కైవసం చేసుకున్నారు. కొండవీడు మేజరు టీసీ 136 నీటి సంఘం అధ్యక్షుడిగా మద్దూరి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడిగా తోట శ్రీనివాసరావులు ఎంపికయ్యారు. వంకాయలపాడు మేజరు టీసీ 143.. ఇడుపలపాటి సాయిబాబు, నామినేని శ్రీనివాసరావు, పీబీసీ జాలాది.. పోపూరి రాఘవయ్య, గొట్టిపాటి వెంకటేశ్వర్లులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.



వంకాయలపాడులో ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎన్నికల అధికారి జాకీర్‌హుస్సేన్

వైసీపీకి రైతులు ఇప్పుడు గుర్తొచ్చారా..?

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు రైతులకు మద్దతు, పంట నష్టపరిహారం కోసం టీడీపీ వారు రోడ్డెక్కి నిరసనలు తెలియచేసే వరకు కనీసం క్షేత్రస్థాయి పరిశీలనకు కూడా రాని వైసీపీ నాయకులు, ఇప్పుడు టీడీపీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా పూర్తి కాకుండానే రైతులకు ఏదో అన్యాయం జరుగుతుందంటూ రోడ్డెక్కడం విడ్డూరంగా ఉందని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. గడచిన ఐదేళ్లలో రైతులకు కనీస పరిహారం చెల్లించలేదని, గిట్టుబాటు ధర కూడా ఇవ్వలేదని, అసెంబ్లీలో చంద్రబాబునాయుడు పంటల బీమాపై నిలదీస్తే, అప్పుడు ఆగమేఘాల మీద చెల్లించారని అన్నారు. జగన్ అధికారంలోకి వస్తే రైతు భరోసా కింద పదిహేను వేల రూపాయలు చెల్లిస్తానని హామీ ఇచ్చి ఒక్కొక్క రైతుకు కేవలం పదమూడున్నర వేలు మాత్రమే చెల్లించారని పేర్కొన్నారు. ఇందులో కేంద్రం ఇచ్చిన ఆరు వేలు పోను మిగిలిన ఏడున్నర వెయ్యి మాత్రమే జగన్ ప్రభుత్వం చెల్లించి రైతులను మోసం చేసిందని వివరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరునెలల లోపే రైతులకు మద్దతు ధర కల్పించ డమే కాకుండా, పంట కొనుగోలు చేసిన వెంటనే 24 గంటల లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుందని చెప్పారు.

కష్టపడే కార్యకర్తలకు టీడీపీలో ఎప్పుడూ గుర్తింపు



బహుమతి ప్రదానం చేస్తున్న ప్రత్తిపాటి పుల్లారావు

మై టీడీపీ యాప్ ద్వారా వస్తున్న కంటెంట్‌ను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ కష్ట పడుతున్న టీడీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులకు పార్టీలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే పుల్లారావు శనివారం అన్నారు. ఆరునెలల టీడీపీ పాలనలో సాధించిన ఘన విజయాలను, ప్రతిపక్ష నేత జగన్ వైఫల్యాలను ఎండగడుతూ మై టీడీపీ యాప్‌లో వస్తున్న కంటెంట్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి అత్యధిక పాయింట్లు సంపాదించిన సోషల్ మీడియా యాక్టివిస్టులు 14 మందికి టీడీపీ అధిష్ఠానం నుంచి వచ్చిన బహుమతులను ప్రత్తిపాటి అందజేశారు. వారిని అభినందించారు.

క్రీస్తు బోధనలు ప్రజలను సన్మార్గంలో నడిపిస్తాయి

నాదెండ్ల, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): లోక రక్షకుడిగా వచ్చిన క్రీస్తు చేసిన బోధనలు ప్రజలను సన్మార్గంలో నడిపిస్తాయని ఎమ్మెల్యే పుల్లారావు అన్నారు. నాదెండ్లలో సాధు ఏసోబు, మరియమ్మల జ్ఞాపకార్థం నిర్మించిన రక్షణ సంఘం మినిస్ట్రీస్ కన్వెన్షన్ హాల్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో రక్షణ సంఘం ప్రతినిధులు జాన్ వెస్లీ, అనోక్ వెస్లీ, డీఎస్పీ కే నాగేశ్వరరావు, లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, టీడీపీ నాయకులు సదాశివరావు, నల్లబోతు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించే వారికి మంచి అవకాశాలు

- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు



ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైన బాలురతో రాయల శ్రీనివాసరావు, కపిలవాయి రాజేంద్రప్రసాదు, కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 14(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో రాణించాలని, అందరికీ మంచి అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం వాగ్దేవి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా స్థాయి కబడ్డీ బాలుర, బాలికల జట్ల ఎంపికల కార్యక్రమం జరిగింది. పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా చదలవాడ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అవకాశాలు కల్పిస్తుందన్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ఆడి పల్నాడు ప్రాంతానికి ఎన్నో మెడల్స్ తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులు ఆరోగ్యంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాదు, ఓగూరి నాగేశ్వరరావు, గుప్తా శ్రీకాంత్, కాట్ల రామకోటేశ్వరరావు, వైవీ చిరంజీవి, వనమా శివ, కొట్టా కిరణ్, మడకా శివప్రసాదు, తదితరులు పాల్గొన్నారు. కాగా ఉమ్మడి గుంటూరు జిల్లా బాలురు, బాలికల కబడ్డీ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు అభినందించారు. ఈ సందర్భంగా రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ అండర్-20 బాలుర, బాలికల విభాగంలో 70 కేజీల లోపు బరువు ఉన్న వారికి పోటీలు నిర్వహించారన్నారు. ఎంపికైన బాలుర, బాలికల జట్లు రావులపాలెంలో జరిగే పోటీల్లో గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎంపికలు వాగ్దేవి కళాశాలలో జరగడా నికి ప్రోత్సహించిన పీడీలు వైవీ చిరంజీవి, కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ ఎం సుబ్బారాజులకు అభినందనలు తెలియజేశారు. 12 మంది పీడీలు సమన్వయంతో ఎలాంటి వివక్ష లేకుండా మంచి జట్లును ఎంపిక చేశారన్నారు. 16 నుంచి 21వ తేదీ వరకు వాగ్దేవి కళాశాలలోనే క్యాంపు నిర్వహించి శిక్షణ ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకొని మంచి ఫలితాలు సాధించాలని కోరారు.

రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

- టీడీపీ జిల్లా అధికారప్రతినిధి జగ్గారావు



నూతన అధ్యక్షులను అభినందిస్తున్న జగ్గారావు

ఈపూరు, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆయకట్టుపరిధిలో ఆఖరి భూములకు సైతం సాగునీటిని అందించి రైతుల అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడేది కూటమి ప్రభుత్వమని పల్నాడు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు అన్నారు. సాగునీటి సంఘాలకు అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఎన్నికైన వారిని శనివారం అయన అభినందించారు. ఈ సందర్భంగా జగ్గారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కాలువల మరమ్మతులకు నోచుకోకపోవడంతో సాగునీరు సక్రమంగా అందక కర్షకులు నానా కష్టాలు పడ్డారన్నారు. అలాంటి ఇబ్బందులు పడకుండా రైతులు తామే కమిటీని ఏర్పాటు చేసుకొని సాగునీటి కాలువల అభివృద్ధికి పాటుపడేలా ప్రభుత్వం చొరవచూపిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, అయినాల కోటేశ్వరరావు, విడపలపాటి హనుమయ్య, బెల్లంకొండ సైదులు, బైలడుగు రామయ్య, కూరాకుల శ్రీనివాసరావు, నిశ్శంకరరావు అంకారావు, శీలం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన స్వామి ఆరాధనోత్సవం



కాశినాయన సత్సంగంలో పాల్గొన్న భక్తులు

వినుకొండ, డిసెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏనుగుపాలెంరోడ్డులోని గల కాశినాయన 29వ ఆరాధన మహోత్సవాలు శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆశ్రమంలో మార్గశిర శుద్ధ చతుర్థశి పౌర్ణమి గడియల్లో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కాశినాయనకు భక్తులతో సత్సంగం పారాయణం భజన కార్యక్రమంతోపాటు వేలమందికి అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. శనివారం రాత్రి ఆశ్రమ ఆవరణలో బ్రహ్మంగారి పూర్తినాటక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించి భక్తులను విశేషంగా ఆకట్టుకున్నారు.